
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
సోమవారం 13 అక్టోబరు 2025



సభనుద్దేశించి మాట్లాడుతున్న మంత్రి తుమ్మల

### నూనె ఉత్పత్తిలో దేశం
# స్వయం సమృద్ధి చెందాలి

- టీఎస్ ఆయిల్‌ఫెడ్ అత్యధిక ఓఈఆర్, 300 మె.టన్నుల లక్ష్యాన్ని అధిగమించడం అభినందనీయం
- నూనె దిగుమతులపై సుంకాన్ని పెంచాలి
- ఆయిల్‌ఫెడ్ అధికారుల అభినందన సభలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- పాల్గొన్న ఆయిల్‌ఫెడ్ చైర్మన్ రాఘవరెడ్డి, ఎమ్మెల్యే జారే, కలెక్టర్ జితేష్ వీ పాటిల్

అశ్వారావుపేట/ దమ్మపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశం ఆర్థిక వ్యవస్థ బలోపేతం కావాలంటే దేశీయంగా నూనె ఉత్పత్తుల్లో స్వయం సమృద్ధి సాధించడం ఎంతో అవసరమని వ్యవసాయ, ఉద్యాన పట్టు పరిశ్రమల శాఖామాత్యులు తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ప్రస్తుతం దేశంలో వినియోగం అవుతున్న ఆయిల్స్‌లో 70శాతం వరకు విదేశాల నుంచి దిగుమతి అవుతుందని, దిగుమతులు తగ్గించుకొని స్వదేశంలో నూనె ఉత్పత్తులను పెంచుకోవాలంటే ఆయిల్‌పామ్‌ను ప్రోత్సహించడం ద్వారానే సాధ్యమవుతుందని అన్నారు. టీఎస్ ఆయిల్‌పామ్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం దమ్మపేట మండలం అప్పారావుపేట పామాయిల్ ఫ్యాక్టరీలో ఆయిల్‌పామ్‌లో మొదటిసారిగా 300 మెట్రిక్ టన్నుల క్రషింగ్ లక్ష్యాన్ని అధిగమించేలా కృషి చేసిన ఆయిల్‌ఫెడ్ అధికారులకు సన్మాన సభను ఏర్పాటు చేశారు. టీఎస్ ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఇప్పటికే ఆయిల్ ఇయర్‌లో నిర్దేశించిన లక్ష్యం 300 మెట్రిక్ టన్నుల ఆయిల్ ఉత్పత్తిని అధిగమించిన ఆయిల్‌ఫెడ్ త్వరలోనే 20శాతం ఓఈఆర్ ( ఆయిల్ ఎక్స్‌ట్రాక్షన్ రేషియా) శాతాన్ని దాటడం ద్వారా మలేషియాలోని ఓఈఆర్‌ను అధిగమించి ప్రపంచంతో పోటీ పడనుండటం తెలంగాణకే గర్వకారణమన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా (మిగతా 6వ పేజీలో)



డీసీసీ అధ్యక్షుడు దుర్గాప్రసాద్, మేయర్ నీరజ, మంత్రి తుమ్మల తనయుడు యుగంధర్‌లు గుర్రాలబొమ్మ సెంటర్‌లో సంతకాల సేకరణ ప్రారంభించిన దృశ్యం

## ఖమ్మంలో కోలాహలంగా..

- ఓట్ చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ సంతకాల సేకరణ
- ఉదయం నుంచి ఉత్సాహంగా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు
- ఇంటింటికీ వెళ్లి సంతకాల సేకరణ
- ఒకేరోజు నియోజకవర్గంలో అన్ని పోలింగ్ కేంద్రాల్లో సంతకాల సేకరణ
- మంత్రి తుమ్మల ఆదేశాలతో నిర్వహణ

6

ముగిసిన రాష్ట్రస్థాయి
## టీటీ పోటీలు

7

నేరాలను నియంత్రించడం, స్మగ్లింగ్ వంటి సంఘటనలను అరికట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం, మరీ ముఖ్యంగా పోలీసు శాఖ గ్రామాల్లో సైతం సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. ప్రధానంగా హైవే రోడ్ల వెంట సీసీ కెమెరాలను ఏర్పాటు చేసింది. ఈ సీసీ ఫుటేజీల ఆధారంగా అనేక చోట్ల ఎన్నో కేసులు పరిష్కారమైన ఘటనలు ఉన్నాయి. క్రైమ్ కేసుల్లో కూడా ఇవి ఎంతో కీలకంగా మారిన సందర్భాలూ ఉన్నాయి. ఇంత ప్రాధాన్యత కలిగిన సీసీ కెమెరాలు ఏపీ సరిహద్దులోని తాడువాయి నుంచి తెలంగాణాలోని అశ్వారావుపేట మీదుగా సత్తుపల్లి వైపు ఉన్న గంగారం వరకు పని చేయకుండా మొరాయించి నెలలు దాటిపోయింది. రాజమండ్రి నుంచి హైదరాబాద్ వరకు హైవేపై ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు.. పైన తెలిపిన ప్రాంతం తప్పా, మిగతా ప్రాంతంలో పని చేస్తుండడం గమనార్హం. అయితే పైన తెలిపిన ప్రదేశాలలోనే సీసీ కెమెరాలు పని చేయకపోవడానికి తెర వెనుక గల రహస్యమేంటి!? అన్న విషయం ఎవరికీ అంతు చిక్కడం లేదు. ఇది యాధృచ్ఛికమా? లేకుంటే ఎవరైనా కావాలనే చేశారా !? అన్న విషయాలపై పోలీసులు విచారణ జరిపితే ఎన్నో గమ్మత్తైన విషయాలతో పాటు ఎవరూ ఊహించనటు వంటి ట్విస్టులు వెలుగులోకి వచ్చే అవకాశాలున్నాయనే చర్చ నడుస్తోంది.

# తెర వెనుక రహస్యమేంటో?



అశ్వారావుపేట రింగ్‌రోడ్డు సెంటర్‌లో కనపడని సీసీ కెమెరాలు

- సరిహద్దు నుంచి గంగారం వరకు పని చేయని సీసీ కెమెరాలు
- ఆ ప్రాంతంలోనే సీసీ కెమెరాలు పని చేయకపోవడం వెనుక ఆంతర్యమేంటో!?
- యాధృచ్ఛికమా? స్మగ్లర్ల పనా?
- నెలల తరబడి మరమ్మతులు చేయకపోవడంపైనా అనుమానాలు



సరిహద్దులో పని చేయని సీసీ కెమెరా

అశ్వారావుపేట, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఏపీ నుంచి తెలంగాణలోకి ప్రవేశించడానికైనా.. తెలంగాణ నుంచి ఏపీకి వెళ్లేందుకైనా అశ్వారావుపేట ముఖ ద్వారంగా ఉంది. రాష్ట్ర సరిహద్దు కావడంతో అశ్వారావుపేటలో రవాణా శాఖ చెక్ పోస్టు ఉండడం.. రాష్ట్రంలోకి ప్రవేశించాక కొద్ది కిలోమీటర్ల వరకు అక్కడక్కడ వివిధ శాఖల అధికారుల పర్యవేక్షణలు ఉంటాయి. తెలంగాణ నుంచి ఏపీలోకి అక్రమ బియ్యం పెద్ద ఎత్తున రవాణా అవుతుంటుంది. అలాగే ఏపీ, ఒడిస్సా నుంచి అశ్వారావుపేట మీదుగా గంజాయి, పలు రకాల రసాయనిక పదార్థాలు, కల్తీ మద్యం, ముఖ్యంగా ఇసుక లారీలు పెద్ద ఎత్తున తెలంగాణలోకి ప్రవేశిస్తున్నాయి. ఇటీవల ఇసుక అక్రమ రవాణా ప్రతీరోజు వంద వరకు లారీలలో హైదరాబాద్, నల్గొండ, ఖమ్మం ప్రాంతాలకు భారీగా రవాణా అవుతోంది. వాహనాల చోరీ, ఇళ్లల్లోనూ దారి దోపిడీ దొంగలు ఎక్కువగా ఈ ప్రాంతానికి ఏపీ నుంచే వస్తుంటారు. అశ్వారావుపేటలో నమోదు అయ్యే కొన్ని క్రిమినల్ కేసుల్లోను ఆ వైపునకు చెందినవారు ఉంటారు. ఇవన్నీ ఒక ఎత్తయితే హైదరాబాద్, నల్గొండ, కొవ్వూరుకు చెందిన వాహనదారులు పెద్ద ఎత్తున ఇసుక రవాణా చేస్తున్నారు. వీరు అత్యంత పకడ్బందీగా, ప్రత్యేకించి పైలెట్‌లను ఏర్పాటు చేసుకోవడం, మార్గమధ్యలో పలువురి అధికార, అనధికార వర్గాల సహాయ సహకారాలతో రోజుకి కోటి రూపాయల విలువ చేసే ఇసుక అశ్వారావుపేట మీదుగా తరలిపోతుందనే అంచనా ఉంది. వీరు అక్రమ రవాణా సమయంలో ఎవరైనా అడ్డొస్తే దేనికైనా తెగించడానికి వెనుకాడరనే ప్రచారం ఉంది. ఇసుక అక్రమ రవాణాలో తెలంగాణలోని కొందరు అత్యంత కీలకమైన వ్యక్తుల ప్రమేయం ఉండవచ్చుననే అనుమానాలు కలుగుతున్నాయి. ఇంత పెద్ద ఎత్తున జరిగే స్మగ్లింగ్‌కు చెందిన వారేమైనా తాడువాయి నుంచి గంగారం వరకు సీసీ కెమెరాలు పనిచేయకుండా ఎత్తుగడ వేసి ఇలా చేశారేమో.. అన్న అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఇదంతా ఒక ఎత్తయితే.. నెలల కొద్దీ హైవేపైన ఈ సీసీ కెమెరాలు పని చేయకపోయినా.. మరమ్మతులు చేపట్టకపోవడం కూడా పలు అనుమానాలకు, ప్రచారాలకు బలాన్ని చేకూరుస్తున్నాయి. రెండు రోజుల క్రితం జరిగిన నూనె బాక్సుల చోరీ సమయంలో పోలీసులు సీసీ కెమెరాల ఫుటేజీ దొరుకుతుందేమో అని పరిశీలించి విఫలమైన సంఘటన ఇందుకు నిదర్శనంగా చెప్పొచ్చు. ఈ అనుమానాలు నిగ్గు తేలాలన్నా.. ప్రచారాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలన్నా రాష్ట్ర ప్రభుత్వం, పోలీసులు లోతైన విచారణ చేపట్టాలనే డిమాండ్ వ్యక్తమవుతోంది. పోలీసుల నేర విచారణలో ఎంతో ప్రాధాన్యత కలిగిన సీసీ కెమెరాలను తక్షణమే పునరుద్ధరించి, ఎప్పటికప్పుడు మరమ్మతులు చేపట్టాల్సిన బాధ్యత ఆ శాఖ ఉన్నతాధికారులపై ఉంది. అశ్వారావుపేట మీదుగా జరుగుతున్న పలు రకాల స్మగ్లింగ్‌ను ఆధారంగా చేసుకొని కాసులు సొమ్ము చేసుకుంటున్న దళారులకు తక్షణమే చెక్ పెట్టాల్సిన బాధ్యత కూడా వారిపైనే ఉంది. ఇప్పటికే సీసీ కెమెరాలు పనిచేయని విషయమై ఇంటెలిజెన్స్ విభాగం సిబ్బంది.. ఉన్నతాధికారులకు నివేదిక ఇచ్చినట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో అధికారులు ముందు ఎలాంటి చర్యలు చేపడుతారోనన్నది వేచి చూడాల్సిందే..!!

# పేదల సంక్షేమమే ఎజెండాగా..

- కొనసాగుతున్న ప్రజా ప్రభుత్వ పాలన
- రానున్న రోజుల్లో మారనున్న గ్రామాల రూపురేఖలు
- గత 21నెలల్లో ఎన్నో అభివృద్ధి పనులు చేపట్టాం
- మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడుతున్న మంత్రి పొంగులేటి

ఖమ్మం రూరల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి) : పేద ప్రజల అభివృద్ధి, సంక్షేమమే ఎజెండాగా ప్రజా ప్రభుత్వ పాలన కొనసాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆదివారం ఖమ్మం జిల్లా ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని వెంకటగిరిలో ఖమ్మం-కోదాడ ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి జీ+2 కాలనీ వయా ఇందిరమ్మ కాలనీ ఫేజ్ 2 వరకు రూ.1.71 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డుకు కలెక్టర్ అనుదీప్ దురిశెట్టితో కలిసి మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. కొత్తగా ఏర్పడిన మున్సిపాలిటీలో మౌలిక వసతుల కల్పనపై ప్రధానంగా దృష్టి సారించామన్నారు. రానున్న రోజుల్లో పుర పరిధిలోని గ్రామాల రూపు రేఖలు పూర్తిగా మారనున్నాయన్నారు. మున్సిపాలిటీలో రూ.1.53 కోట్లతో అంతర్గత సీసీ రోడ్లు, రూ.2.35 కోట్లతో మినీ స్టేడియం నిర్మాణాన్ని చేపట్టామన్నారు. దీన్ని త్వరలో ప్రారంభించనున్నట్లు తెలిపారు. మంచినీటి సదుపాయానికి రూ.10 లక్షలు ఖర్చు చేశామన్నారు. వెంకటగిరి ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి ఖమ్మం కోదాడ ఆర్‌అండ్‌బీ రోడ్డు వయా జంగాల కాలనీ వరకు రూ. 1.32 కోట్లతో, అలాగే ప్రకాష్‌నగర్ బ్రిడ్జి నుంచి ఖమ్మం, కోదాడ ఆర్‌అండ్‌బీ వయా కోటనారాయణపురం ఇందిరమ్మ కాలనీ వరకు రూ.2.50 కోట్లు, వెంకటగిరి ఎస్సీ బీసీ కాలనీ నుంచి గుదిమళ్ల వరకు రూ.2.4 కోట్లు రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు చేశామన్నారు. గడిచిన 21 నెలల్లో ఈ ప్రాంత అభివృద్ధికి రూ.12.47 కోట్ల అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. నాటి పాలకులు రాష్ట్రాన్ని అప్పుల పాలు చేసినా సంక్షేమ పథకాలు ఎక్కడా ఆగకుండా కొనసాగిస్తున్నట్టు మంత్రి తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా నాలుగున్నర లక్షల ఇందిరమ్మ ఇళ్లను పేదలకు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనన్నారు. అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తామన్నారు. ఇది నిరంతర ప్రక్రియ అని అన్నారు. చిన్న వెంకటగిరి కోదాడ ప్రధాన రహదారి పక్కన అసంపూర్తిగా ఉన్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాన్ని పూర్తి చేసి పేదలకు ఇవ్వాలని కలెక్టర్‌కు సూచించారు. వైఎస్ఆర్ హయాంలో నిర్మించతలపెట్టి అసంపూర్తిగా నిలిచి ఉన్న ఇందిరమ్మ ఇళ్లను మంత్రి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో పాలేరు నియోజకవర్గ ప్రత్యేక అధికారి రమేష్, ఆర్డీఓ నరసింహరావు, కమీషనర్ శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ చైర్మన్ హరినాదబాబు, నాయకులు తమ్మినేని నవీన్, మల్లారెడ్డి, రాంమూర్తి నాయక్ రాజశేకర్ తదితరులు పాల్గొన్నారు.



సింగరేణిలో కారుణ్య నియామకాలకు
# మంగళం!?

- నిలిచిపోయిన మెడికల్ బోర్డు
- మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ అయిన వారికి ఉద్యోగ నియామకాల్లో జాప్యం

కొత్తగూడెం టౌన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : సింగరేణిలో కారుణ్య నియామకాలకు మంగళం పాడుతున్నారనే ప్రచారం జోరందుకుంది. సింగరేణి వ్యాప్తంగా గత మార్చి నెల నుంచి మెడికల్ బోర్డు నిలిపివేయడం చర్చనీయాంశంగా మారింది. మెడికల్ ఇన్‌వ్యాలిడేషన్ అయిన కార్మికుల వారసులకు ఉద్యోగ నియామకాల్లో సైతం సింగరేణి యాజమాన్యం తీవ్ర జాప్యం చేస్తోందన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సింగరేణి వ్యాప్తంగా పలు భూగర్భ బావులు, ఓపెన్‌కాస్ట్‌లు మూతపడడంతో కార్మికులు అధికమయ్యారనే నెపంతో కారుణ్య నియామకాల్లో యాజమాన్యం జాప్యం చేస్తోందని కార్మిక సంఘాలు ఆరోపిస్తున్నాయి. మైన్స్ మూతపడడం.. నూతన ప్రాజెక్టులు రాకపోవడం.. సింగరేణికి సవాల్‌గా మారింది. కొత్త ప్రాజెక్టుల కోసం యాజమాన్యం, రాష్ట్ర ప్రభుత్వం పెద్ద ఎత్తున ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ.. పలు నిబంధనలు సింగరేణికి తలనొప్పిగా మారాయి. మెడికల్ బోర్డులో సైతం పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరుగుతున్నాయనే నెపంతో ఏసీబీ దాడులు కొనసాగడం.. పలువురు అధికారులు, కార్మిక సంఘాల నాయకులను విచారించడం జరిగింది. దీంతో గతంలో చీఫ్ మెడికల్ ఆఫీసర్‌గా (మిగతా 6వ పేజీలో)

ఖమ్మంలో టీటీడీ ఆలయ నిర్మాణానికి..
# స్థల సేకరణపై దృష్టి

- పరిశీలించిన కలెక్టర్ అనుదీప్
- ఆలయం పూర్తయితే ఆధ్యాత్మికంగా అభివృద్ధి : కలెక్టర్



ఖమ్మం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : తిరుమల తిరుపతి దేవస్థానం నిధులతో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో ఖమ్మంలో నిర్మించబోతున్న టీటీడీ ఆలయ నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయింపుపై అధికారులు దృష్టి పెట్టారు. త్వరలో ఖమ్మంకు టీటీడీ అధికారులు రాబోతున్నందు వల్ల ఇందుకు సంబంధించి స్థలాన్ని కేటాయించేందుకు జిల్లా అధికార యంత్రాంగం చర్యలు చేపట్టింది. ఈ మేరకు ఆదివారం ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి భూసేకరణ కోసం ఆలయం నిర్మించే ప్రాంతాన్ని పరిశీలించారు. అధికారులతో కలిసి నగరంలోని 15వ డివిజన్ కొత్తగూడెం, అల్లీపురంలోని ప్రభుత్వ భూములతో పాటు ప్రాధాన్యత కలిగిన స్థలాలను సందర్శించారు. వివాదాలు లేకుండా ఆలయ నిర్మాణానికి అనుకూలంగా ఉన్న స్థలాలను తిలకించారు అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. టీటీడీ నిధులతో నిర్మిస్తున్న ఆలయానికి రెండు, మూడు స్థలాలను పరిశీలించడం జరిగిందన్నారు. టీటీడీ అధికారులు, స్థపతి, పండితులు ఖమ్మానికి వచ్చి ఆలయ నిర్మాణానికి అనువైన భూమిని చూసి ఖరారు చేస్తారని తెలిపారు. ఖమ్మంలో కొత్తగా నిర్మించే టీటీడీ వేంకటేశ్వరస్వామి ఆలయం ఆధ్యాత్మికంగా, పర్యాటకంగా ఖమ్మం మరింత అభివృద్ధి సాధిస్తుందన్నారు. దేవాలయానికి సరిపడా భూములను గుర్తించడం జరిగిందని కలెక్టర్ వివరించారు. కలెక్టర్ వెంట ఆర్డీవో నరసింహారావు, అర్బన్ తహసీల్దార్ సైదులు తదితరులు పాల్గొన్నారు.

### ఎండు తెగులు..
# వరి రైతుల గగ్గోలు



- కల్లూరు మండలంలో వేలాది ఎకరాల్లో వరి పంటకు తీవ్ర నష్టం
- 50 శాతం దిగుబడి తగ్గుతుందని రైతుల ఆవేదన
- అధిక వర్షాలే ప్రధాన కారణం అంటున్న వ్యవసాయశాఖ

కల్లూరు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి):ఈ ఏడాది అధిక వర్షాల ప్రభావంతో ఖమ్మం జిల్లా కల్లూరు మండలంలోని పలు గ్రామాల్లో వానాకాలం పంటగా సాగు చేసిన వరి పైరుకు కంకి పాలు పోసుకునే దశలో ఎండు తెగులు, కాటుక తెగులు సోకింది. దీంతో వరి పైరు కంకి కాండం భాగంలో ఆకులు ఎండి మాడిపోతున్నాయి. ఈ దశలో వరి పైరుకు ఎండు తెగులుతో పంట దిగుబడి సగానికి సగం తగ్గుతుందని బాధిత రైతులు గగ్గోలు పెడుతున్నారు. గత జూలై, ఆగస్టు నెలలో సాగు చేసిన వరి పైరుకు ఈ ఎండు తెగులుతో పాటు కాటుక తెగులు సోకడంతో.. రైతులు పలుమార్లు మందులు వాడినా, ఫలితం లేదని మండలంలోని చంద్రుపట్ల గ్రామానికి చెందిన బాధిత రైతులు జక్కంపూడి కిషోర్, కాటంనేని రామారావులు అంటున్నారు. ఇప్పటికే మండలంవలోని చంద్రుపట్ల గ్రామంలోనే పెద్దచెరువు పరిసర ప్రాంతాల్లో సుమారు 1500 ఎకరాలకు ఎండు తెగులు, కాటుక తెగులు రావడంతో రైతులు తీవ్ర నిరాశ చెందుతున్నారు. వరిపైరు పక్వానికి వచ్చి మరో 10-15 రోజుల్లో కోతలు ప్రారంభం కానున్న ఈ దశలో ఎండు తెగులుతో దుబ్బు పైభాగం కాండం (కంకుల) ఎండిపోతోంది. దీంతో వరి పాలు పోసుకుంటున్న వరి కంకులు తాలుగా మారడమే కాకుండా, నలుపు రంగు పౌడర్‌గా కూడా మారుతుందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే వరి సాగు చేసిన రైతులు సగటున ఎకరానికి రూ. 28 వేల వరకు పెట్టుబడులు పెట్టారు. చంద్రుపట్ల గ్రామంలో వరి సన్నాలు ఎంటియు- 1224 రకం, బిపిటి రకం 5204 రకం సాగు చేశారు. ఇలా సాగు చేసిన వరికి ఎక్కువశాతం ఎండు తెగులు సోకిందని రైతులు చెబుతున్నారు. మండలంలోని చంద్రుపట్ల, ఎర్రబోయనపల్లి, రఘునాథబంజర, వాచ్యానాయక్‌తండ, పోచవరం, పుల్లయ్యబంజర, లోకవరం, కల్లూరు తదితర గ్రామాల్లో వరి పైరుకు ఎండు తెగులు సోకింది. వరి పైరుకు తెగుళ్లు సోకుతున్న దశలో వాటి నివారణకు క్షేత్ర స్థాయిలో వ్యవసాయ శాఖాధికారులు సందర్శించి.. ఎలాంటి సూచనలు ఇవ్వడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. ఇలా వానాకాలం సీజన్‌లో సాగు చేసిన వరి పైరుకు వరుస వర్షాల వల్ల ఈ రకమైన తెగులు సోకుతుందని మండల వ్యవసాయ అధికారి ఏ. రూప చెబుతున్నారు. ఈ దశలో వరి పైరుకు తెగులు నివారణ సాధ్యం కాదని చెప్పారు. యూరియా ఎక్కువ మోతాదులో వాడడంతో.. తెగులు ఎక్కువ సోకే అవకాశం ఉందని వివరించారు. ఏది ఏమైనా ఈ వానాకాలంలో అధిక వర్షాలతో వరి పైరుకు ఎండు తెగులు, కాటుక తెగులు సోకటంతో కల్లూరు మండలంలో సాగర్ కాల్వ పరిధిలో సాగు చేసిన వేలాది ఎకరాల్లో వరి పంటకు తీవ్రంగా నష్టం జరిగింది. ఫలితంగా 50శాతం పంట దిగుబడి తగ్గనుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ఖమ్మంలో కోలాహలంగా..

# ఓట్ చోరీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ సంతకాల సేకరణ

ఉదయం నుంచి ఉత్సాహంగా పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు

ఇంటింటికీ వెళ్లి సంతకాల సేకరణ

ఒకేరోజు నియోజకవర్గంలో

అన్ని పోలింగ్ కేంద్రాల్లో సంతకాల సేకరణ

మంత్రి తుమ్మల ఆదేశాలతో నిర్వహణ



పత్రాలను అందిస్తున్న దృశ్యం

ఖమ్మం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ప్రాతినిధ్యం వహిస్తున్న ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో ఆదివారం ఓట్ చోరీకి వ్యతిరేకంగా సంతకాల సేకరణ కార్యక్రమం ముమ్మరంగా సాగింది. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఆయా డివిజన్లు, పోలింగ్ కేంద్రాల పరిధిలో కాంగ్రెస్ జెండాలు చేతబట్టి ఇంటింటికీ వెళ్లి సంతకాల సేకరణను ఉద్యమంలా సాగించారు. ఉదయం నగరంలోని గుర్రాల బొమ్మ సెంటర్‌లో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మేయర్ పునుకొల్లు నీరజ, మంత్రి తుమ్మల తనయుడు జిల్లా కాంగ్రెస్ నాయకుడు తుమ్మల యుగంధర్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టారు. మరోవైపు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు జావీద్ తదితరులు సంతకాల సేకరణలో పాలుపంచుకున్నారు. నగర వర్కింగ్ ప్రెసిడెంట్ నాగండ్ల దీపక్‌చౌదరి, కార్పొరేటర్లు కమర్తపు మురళి, ముదిగొండ సొసైటీ అధ్యక్షుడు తుపాకుల యలగొండ స్వామి, నాయకులు బాలగంగాధర్ తిలక్, పాలెపు వెంకటరమణ తదితరులు పాలుపంచుకున్నారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు శనివారం క్యాంపు కార్యాలయంలో అత్యవసర సమావేశం నిర్వహించి నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలకు బీజేపీ ఓట్‌చోర్‌కు వ్యతిరేకంగా సంతకాల సేకరణ ఉద్యమం ఆదివారం ఖమ్మం నగరంలో చేపట్టాలని తద్వారా ఖమ్మం నియోజకవర్గంలో రాష్ట్రానికి ఆదర్శంగా నిలవాలని దశ దిశా నిర్దేశించారు. అందుకు అనుగుణంగా డివిజన్లలో కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ అధ్యక్షులు, రఘునాథపాలెం మండలంలోని పలువురు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు ఏఐసీసీ ఇచ్చిన సంతకాల సేకరణ పత్రాలను ఇంటింటికీ తీసుకెళ్లి అందించారు. దేశంలో బీజేపీ ఓటర్ల జాబితాలో అర్హుల ఓట్లను తొలిగించి అధికారంలోకి వస్తుందని, విపక్ష ఓటర్లను తొలగిస్తున్నారన్నారు. ఇప్పటికే ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు కూడా చేయడం జరిగిందన్నారు. సంతకాల సేకరణ ద్వారా రాష్ట్రపతిని కలిసి దేశంలో ఓట్లచోరీని వివరిస్తామని నాయకులు వివరించారు. ఇంటింటికీ వెళ్లి రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను కూడా తెలిపారు. మొత్తమ్మీద మంత్రి తుమ్మల ఆదేశాలతో ఖమ్మం నియోజకవర్గంలో ఓట్‌చోరీకి వ్యతిరేకంగా ఒకేరోజు విజయవంతంగా సంతకాల సేకరణ చేపట్టారు. ఆ తర్వాత సాయంత్రం మంత్రి తుమ్మల క్యాంపు కార్యాలయంలో తుమ్మల తనయుడు యుగంధర్‌కు సంతకాల పత్రాలను అందించారు.

# నేడు ఖమ్మంలో ఏటీసీ సెంటర్ ప్రారంభం






నూతన ఏటీసీ భవనం, అధునాతన పరికరాలు

- హాజరుకానున్న మంత్రి తుమ్మల
- 6 కోర్సుల్లో యువతకు శిక్షణ
- ఉమ్మడి జిల్లాలో నాలుగు ఐటీఐల్లో ఏటీసీ కేంద్రాల ఏర్పాటు

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం నగరంలోని టేకులపల్లిలోగల ప్రభుత్వ ఐటీఐను ఏటీసీగా రుపుదిద్దారు. రూ.4.77కోట్లతో భవనం,అధునాతన పరికరాలతో పనులు పూర్తి చేశారు. సోమవారం వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఈ భవనాన్ని ప్రారంభిస్తారని కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. ప్రభుత్వ ఐటీఐలను ఏటీసీలుగా మార్చటంతో వాటి రూపురేఖలు మారనున్నాయి. ప్రభుత్వం టీటీఎల్ (టాటాటెక్నాటజీలిమిటెడ్)తో ఒప్పందం చేసుకుంది. ఈనేపథ్యంలో పలు కొత్తకోర్సులను ప్రభుత్వం తీసుకువచ్చింది.విద్యార్థులకు ఉపాధే లక్ష్యంగా శిక్షణ అందించి టీటీఎల్ సంస్థలోనే ఉద్యోగాలు ఇచ్చేలా ఒప్పందం కుదుర్చుకున్నారు. దక్షిణ భారతదేశంలో కేరళ, తమిళనాడు తర్వాత మన రాష్ట్రంలో ఈకోర్సులు అందుబాటులోకి వస్తున్నాయి.

### అధునాతన సాంకేతిక కోర్సులు

కాలం చెల్లిన సంప్రదాయ కోర్సులతో ఇప్పటికీ నెట్టుకొస్తున్న ఈ ఐటీఐల్లో ఉపాధి అవకాశాల కల్పనే లక్ష్యంగా అధునాతన సాంకేతిక కోర్సులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. దీంతో ఐటీఐలంటే విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చిన్నచూపు చూసే పరిస్థితి మారనుంది. ఐటీఐలను అడ్వాన్స్ ట్రైనింగ్ సెంటర్స్ (ఏటీసీ)గా మార్చేందుకు రాష్ట్రప్రభుత్వం పనులకు శ్రీకారం చుట్టింది. ప్రభుత్వ ఐటీఐలను ఏటీసీలుగా మార్చేందుకు టాటాటెక్నాలజీ లిమిటెడ్ (టీటీఎల్)తో ప్రభుత్వం ఒప్పందం కుదుర్చుకోవడంతో వాటి దశ, దిశ మారనుంది.

### రాష్ట్రంలో 64 ఐటీఐల్లో

రాష్ట్రంలో 64ఐటీఐలను ఏటీసీలుగా మార్చాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందులో 25 ఐటీఐలను ఏటీసీలుగా మార్చిపనులు ప్రాంభించారు. దీనిలో భాగంగా ఉమ్మడి ఖమ్మం జిల్లాలో నాలుగు ఐటీఐలు ఏటీసీలుగా మారాయి. నగరంలోని టేకులపల్లి ఏటీసీని నోడల్ ఏటీసీగా ప్రభుత్వం గుర్తించింది. గతనెలలో నూతన కోర్సులకు సంబంధించి పరికరాలతో శిక్షణ, ఏటీసీల సిబ్బందికి పూర్తిచేశారు. ప్రస్తుతం భవన నిర్మాణా పనులు పూర్తి కాగా సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేతుల మీదుగా ప్రారంభం కానున్నది. టాటా టెక్నాలజీ లిమిటెడ్ (టీటీఎల్) సహకారంతో వీటిని అప్ గ్రేడ్ చేశారు.

### పదోతరగతి విద్యార్థులకు శిక్షణ

ఐటీఐ సర్కిల్ డెవలప్మెంట్ ఆప్షన్ ప్రాజెక్టులో భాగంగా ఐటీఐలలో ఆధునిక పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా పదోతరగతి ఉత్తీర్ణత పొందిన విద్యార్థులకు శిక్షణ అందించనున్నారు.ఇందులో అధునాతన సామగ్రిని, సాంకేతికతను ఏర్పాటు చేశారు. ప్రత్యేక నిపుణులతో ఇందులో విద్యార్థులకు శిక్షణ ఇస్తారు. ఆరు అధునాతన ట్రేడ్స్‌ను ఏర్పాటు చేశారు. పరిశ్రమల డిమాండ్ మేరకు ఆరు కొత్తకోర్సులు విద్యార్థులకు అందుబాటులోకి రానున్నాయి. అందులో ఆర్టిజన్ యూజింగ్ అడ్వాన్స్ టూల్స్, ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మ్యానిఫ్యాక్చరింగ్, మ్యానిఫ్యాక్చరింగ్‌ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్, బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వెరిఫైడ్, అడ్వాన్స్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నీషియన్, మెకానిల్ ఎలక్ట్రిక్ వెహికిల్స్ ఉన్నాయి. సవాళ్లను తట్టుకొని ఉపాధి, అవకాశాలు పొందగలిగేలా వృత్తిపరమైన నైపుణ్యాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ ప్రాజెక్టులో భాగస్వామి అవుతుంది.

# రాష్ట్రస్థాయి పోటీలకు ముగ్గురు అటవీ ఉద్యోగుల ఎంపిక

జోనల్‌స్థాయి పోటీలలో ప్రతిభను కనబరచి గోల్డ్‌మెడల్‌ను సాధించిన ఉద్యోగులు



పాపకొల్లు సెక్షన్ ఆఫీసర్ మల్లయ్య



జూలూరుపాడు ఎఫ్ఆర్వో ప్రసాదరావు

జూలూరుపాడు, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రస్థాయిలో జరిగే అటవీశాఖ క్రీడా పోటీలకు జూలూరుపాడుకు చెందిన ముగ్గురు ఉద్యోగులు ఎంపికయ్యిన్నట్లు జూలూరుపాడు ఎఫ్ఆర్వో ప్రసాదరావు ఆదివారం తెలిపారు. అటవీశాఖ భద్రాద్రి జోనల్‌స్థాయి క్రీడాపోటీలు కొత్తగూడెంలోని ప్రకాశం స్టేడియంలో రెండురోజుల పాటు జరిగాయన్నారు. ఈ పోటీలలో జూలా రుపాడు అటవీరేంజ్ అధికారి ప్రసాదరావు పాల్గొని షార్ట్‌పుట్‌లో సీనియ ర్స్ విభాగంలో ప్రతిభను కనబరచి ప్రథమ స్థానాన్ని సాధించి గోల్డ్‌మెడల్‌ను కైవసం చేసుకున్నారు. పాపకొల్లు అటవీ సెక్షన్ అధికారి మల్లయ్య డిస్క్‌త్రోలో ప్రథమ స్థానంలో నిలిచి గోల్డ్ మెడల్‌ను, 200 మీటర్ల పరుగు పోటీలో వెండి పతకం, 21 కిలోమీటర్ల పోటీలో ద్వితీయ స్థానంలో నిలిచి సిల్వర్ మెడల్, 100 మీటర్ల పరుగు పందెంలో పాల్గొని మూడోవ బహుమతిని సాధించారు. మల్లయ్య మొత్తం నాలుగు పతకాలను కైతసం చేసుకున్నారు. నల్లబండబోడు ఎఫ్‌బిఓ చరణ్ 100 మీటర్ల పరు గు పందెంలో ద్వితీయ స్థానంలో నిలిచి వెండి పతకాన్ని సాధిం చారు. పాపకొల్లు-బి ఎఫ్‌బిఓ విజయలక్ష్మీ 400 మీటర్ల పరుగు పందెంలో ప్రథమస్థానం, 5 కిలోమీటర్ల పోటీలో ద్వితీయ స్థానా న్ని సాధించి పతకాలను కైవసం చేసుకుంది. జూలూరుపాడులు అటవీ సిబ్బంది మార్చ్‌ఫాస్ట్ పోటీలో పాల్గొని ద్వితీయ స్థానాన్ని సాధించారు. ప్రతిభ కనబరచిన క్రీడాకారులను సీసీఎఫ్ భీమా నాయక్, బిఎఫ్ఓ క్రిష్ణాగౌడ్‌లు అభినందించారు. ఈ నెల 17,18 తేదీలలో హైదారాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఎఫ్ఆర్వో ప్రసాదరావు, పాపకొల్లు ఎఫ్ఎస్ఓ మల్లయ్య, పాపకొల్లు-బి ఎఫ్‌బిఓ విజయలక్ష్మీలు ఎంపికయ్యారు.

# పెనవేసుకున్న 'పచ్చ'ందాల రహదారి

అశ్వారావుపేట రూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఉదయం అయినా మధ్యాహ్నమైనా సాయంత్రం వేళ అటుగా ప్రయాణం చేస్తే చాలు పెనవేసుకున్న పచ్చనిచెట్లతో చల్లటి వాతావరణంలో ఎక్కడి లేని ఆహ్లాదం కలుగుతుంది. సూర్యోదయం వేళ అయితే చెప్పేపనే ఉండదు. పెనవేసుకున్న పెద్ద పెద్దచెట్లతో తోరణాల మాదిరిగా రహదారి ఉంటుంది. అశ్వారావుపేట మండలంలోని అచ్యుతాపురం నుంచి మద్దికొండ వెళ్లే మార్గంలో నాలుగు కిలోమీటర్లు, అచ్యుతాపురం క్రాస్ రోడ్ నుంచి గ్రామంలోకి వెళ్లేదారిలో దాదాపు మూడు కిలోమీటర్ల మేర పెద్దపెద్ద చెట్లు కలిసిపోయి ఉన్నాయి. పచ్చని చెట్లు పెనవేసుకుని సూర్యకిరణాలు కూడా పడని విధంగా ఉన్నాయి. పచ్చనిచెట్లతో రోడ్లు మొత్తం తోరణాల మాదిరిగా ఉండటంతో అటుగా వెళుతున్న వారికి ఎనలేని ఆహ్లాదం కలుగుతుంది. పచ్చదనం కోసం పాకులాతుడున్న నేటితరుణంలో ఇక్కడి రహదారులు చూడముచ్చటగా ఉన్నాయి.



అచ్యుతాపురం క్రాస్ రోడ్ నుంచి వెళ్లేదారిలో పెనవేసుకున్న పచ్చనిచెట్లు



అచ్యుతాపురం నుంచి మద్దికొండ వెళ్లేదారిలో పచ్చదనంతో కూడిన రోడ్డు

# సింగరేణిలో కారుణ్య నియామకాలకు మంగళం!?

(5వ పేజీ తరువాయి)

పని చేసిన సుజాత పదవీ విరమణ చేసిన దగ్గర నుంచి మెడికల్ బోర్డు ఏర్పాటు చేయడంలో యాజమాన్యం వెనుకంజ వేస్తోంది. ఫలితంగా కార్మికుల వారసులకు ఉద్యోగాలు కల్పించేందుకు మెడిక ల్ బోర్డుకు పెట్టిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. గత మార్చి నెల నుంచి మెడికల్ బోర్డు నిలిచిపోవడంతో సింగరేణి వ్యాప్తంగా వందలాది మంది కార్మికులు మెడికల్ బోర్డు కోసం ఎదురు చూస్తున్నారు. ఇప్పటికే మెడికల్ అన్‌ఫిట్ అయిన కార్మికుల వారసులకు అన్ని రకాల పరీక్షలు ఇంటర్వ్యూలు పూర్తి అయినప్పటికీ.. ఉద్యోగ నియామకాల్లో జాప్యం కొనసాగుతోంది. సింగరేణి వ్యాప్తంగా సుమారు 270 మంది వరకు ఉద్యోగాల కోసం ఎదురు చూస్తున్న పరిస్థితి నెలకొంది. ఉద్యోగాల భర్తీ విషయంలో జాప్యం జరగడానికి సింగరేణిలో కార్మికులు అధికంగా ఉండడమే ప్రధాన కారణమని ప్రచారం సాగుతోంది.

సింగరేణి పరిధిలోని శ్రీరాంపూర్ ఏరియాలో ఆర్‌కె. 5 ఇంక్లైన్, ఇల్లందు ఏరియాలోని జెకె 5 ఇంక్లైన్ మూతపడడం వల్ల సుమారు రెండు వేల మందికి పైగా కార్మికులు సర్ప్లస్ (మిగులు ) అయినట్లు సింగరేణి అధికారులు ప్రకటిస్తున్నారు. దీంతో ఉన్న కార్మికులనే సర్దుబాటు చేయడానికి చర్యలు చేపడుతున్నారు. ఇల్లందు ఏరియా నుంచి ఇతర ప్రాంతాలకు కార్మికులను బదిలీ చేయడం.. ఇందుకు కార్మిక సంఘాలు అడ్డుపడడం.. అధికార పార్టీల నాయకుల ఒత్తిడితో కొంత మంది కార్మికులకు పనులు లేనప్పటికీ స్థానికంగానే సర్దుబాటు చేయాల్సి వస్తోందని అధికారులు చెబుతున్నారు. ఇప్పటికే కొత్తగూడెం ఏరియాలోని గౌతంఖని ఓపెన్‌కాస్ట్ మూతపడడం వల్ల కార్మికులను సత్తుపల్లి కిష్టారం ఓసీలకు డిప్యూటేషన్ చేశారు. ఉన్న కార్మికులను సర్దుబాటు చేయడం కష్టతరం కావడంతో కారుణ్య నియామకాలు చేయడానికి యాజమాన్యం వెనుకంజ వేస్తోంది. ఈ నేపథ్యంలో సింగరేణి యాజమాన్యం భవిష్యత్తులో నూతన బొగ్గు బ్లాకుల వేలంపాటలో పాల్గొనేందుకు ప్రభుత్వం నుంచి గ్రీన్ సిగ్నల్ వచ్చింది. దీంతో నూతన బొగ్గుబ్లాకులు వస్తేనే ఉపాధి అవకాశాలు లభించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో కారుణ్య నియామకాలు జరపడం యాజమాన్యానికి తలకు మించిన భారమవుతోంది. కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగాలు పొందిన యువకులు సైతం విధులకు డుమ్మా కొడుతున్నారు. అధిక శాతం మంది కార్మికులు విధులకు హాజరుకాకపోవడంతో గైర్హాజరు శాతాన్ని తగ్గించేందుకు యాజమాన్యం స్పెషల్ డ్రైవ్ నిర్వహించి కార్మికుల కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చినప్పటికీ.. ఆశించిన ఫలితాలు రావడం లేదని పలువురు అధికారులు వ్యాఖ్యానిస్తున్నారు. కార్మికుల గైర్హాజరు సైతం కారుణ్య నియామకాలపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నట్లు తెలుస్తోంది. ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు సుమారు రెండువేల మందికి పైగా 60 మస్టర్లు చేయడం గమనార్హం. కొంత మంది కారుణ్య నియామకాల ద్వారా ఉద్యోగం పొంది ఇతర సంస్థల్లో ఉద్యోగాలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. సాఫ్ట్‌వేర్ రంగంలో పనిచేస్తూ అప్పుడప్పుడు సింగరేణిలో విధులకు హాజరవుతున్నట్లు ప్రచారం సాగుతోంది. ఇప్పటికే విజిలెన్స్ విభాగం గైర్హాజరుకు సంబంధించిన కారణాలపై విచారణ కొనసాగిస్తోంది. ఏదీ ఏమైనా సింగరేణిలో కారుణ్య నియామకాలకు మంగళం పాడుతారనే ప్రచారం మాత్రం జోరుగా సాగుతోంది.

## బాణసంచా దుకాణదారులు అనుమతి తీసుకోవాలి

● భద్రాద్రి ఎస్పీ రోహిత్ రాజు

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): బాణా సంచా దుకాణాలకు స్థానిక డివిజన్ పోలీస్ అధికారుల నుంచి అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్‌రాజు ఆదివారం తెలిపారు. దీపావళి పండుగ సందర్భంగా భద్రాద్రి జిల్లా పరిధిలో తాత్కాలిక టపాకాయల దుకాణాలు నెలకొల్పేవారు సంబంధిత డివిజనల్ పోలీస్ అధికారి కార్యాలయంలో దరఖాస్తు చేసుకొని అనుమతి పొందాలన్నారు. ఎవరైనా అనుమతి లేకుండా టపాకాయల దుకాణాలను నెలకొల్పినట్లు అయితే వారిపై ఎక్స్ ప్లోజివ్ యాక్ట్ -1884, రూల్స్ 1933 సవరణ 2008 ప్రకారం చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా టపాకాయల దుకాణాదారులు తప్పక ప్రభుత్వం విధించిన నిబంధనలు పాటించాలన్నారు. దుకాణం నిర్ణయించిన ఖాళీ ప్రదేశాలలో నెలకొల్పి, ఎన్‌వోసి ధృవపత్రాలు పొందాలని తెలిపారు. ఒక క్లస్టర్లో 50 షాపులకు మించరాదని, జనావాస ప్రదేశాలలో ఎలాంటి టపాకాయల దుకాణాలు ఏర్పాటు చేయరాదన్నారు. దుకాణాల వద్ద అగ్ని ప్రమాదాలు సంభవించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

# నూనె ఉత్పత్తిలో దేశం స్వయం సమృద్ధి చెందాలి

(5వ పేజీ తరువాయి)

ఆయిల్‌పామ్‌ను విస్తరించడం ద్వారా తెలంగాణ ప్రభుత్వం దేశంలోనే నెంబర్ వన్‌గా మారనుందన్నారు. ట్రంప్ దెబ్బకు ప్రపంచ ఆర్థిక వ్యవస్థే అతలాకుతలం అవుతుందని, ఇలాంటి సంఘటనల నుంచి తట్టుకోవాలంటే మన దేశం విదేశాలమీద ఆధారపడకుండా ఉత్తత్తులలో స్వయం సమృద్ధి చెందడం ఎంతో అవసరమన్నారు. కేంద్రం పత్తిపై దిగుమతి సుంకాన్ని పెంచడం కంటే పామాయిల్‌పై దిగుమతి సుంకాన్ని పెంచడం ద్వారా దేశీయ రైతులకు ఎంతో మేలు జరుగుతుందని, అందుకే దిగుమతి సుంకాన్ని పెంచాలని కేంద్రాన్ని కోరుతున్నట్లు తుమ్మల తెలిపారు. ఆయిల్ పామ్ ఫెడ్‌కు మినిమమ్ ప్రైజ్ టన్ను రూ.25వేలుగా నిర్ణయించాలని కేంద్రాన్ని కోరుతున్నామన్నారు. యూరియా కాన్సర్ వంటి రోగాలకు కారకాలని, ఇప్పటికే పంజాబ్‌లో కాన్సర్ రోగులకు వైద్యం కోసం ప్రత్యేక రైలును కేటాయించారని, తెలంగాణలో కూడా హైదరాబాద్‌లోని కాన్సర్ ఆసుపత్రులలో కాన్సర్ రోగులకు అడ్మిషన్ దొరకని పరిస్థితి ఉందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. సాగులో యూరియాను తగ్గించుకోవడం ద్వారా ఈ కారకాలను తగ్గించుకోవచ్చునని, అంతేకాక భూమి సంరక్షణ సాధ్యమన్నారు. రైతులు దీన్ని గమనించి రసాయనేతర ఎరువులైన సేంద్రీయ ఎరువుల వినియోగంపై రైతులు దృష్టి సారించాలన్నారు. వ్యవసాయాన్ని, రైతాంగాన్ని ప్రోత్సహిస్తే మన దేశంలోని 130కోట్ల ప్రజలకు అవసరమైన మేలైన ఆహార ఉత్పత్తులను మన దేశంలోనే పండించే సత్తా మన రైతులకు ఉందన్నారు. రైతులు పామాయిల్‌తో పాటు లాభదాయకమైన ఉద్యాన పంటలు, అంతర పంటలను పండించాలని పిలుపునిచ్చారు. తెలంగాణ ప్రభుత్వం ఉద్యాన పంటలపై ఎన్నో రకాలైన రాయితీలను అందిస్తున్నట్టు తెలిపారు. వరి, పత్తి, మిర్చి వంటి సాంప్రదాయ పంటలను తగ్గించుకొని లాభదాయకమైన పంటలను పండించాలన్నారు. త్వరలోనే దేశంలోనే తెలంగాణ ఆయిల్‌పామ్ నెంబర్ వన్ కాబోతుందన్నారు. 10వేల ఎకరాలు విస్తీర్ణం దాటితే ములకలపల్లిలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని మంజూరు చేస్తామని, అశ్వారావుపేట ఫ్యాక్టరీలో తక్షణమే తాత్కాలిక మరమ్మతులు చేయడంతో పాటు కొత్త ఫ్యాక్టరీకి ఏర్పా టు చేస్తామన్నారు. ఆయిల్‌పామ్ ఓఈఆర్‌ను పెంచే లా, 300 మెట్రిక్ టన్నుల ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించేలా కృషి చేసిన ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి, జీఎం సుధాకర్‌రెడ్డి, అశ్వారావుపేట, అప్పారావుపేట ఫ్యాక్టరీలలో, ఆయిల్‌ఫెడ్‌లలో పనిచేసే ఇతర అధికారులు, సిబ్బంది కృషిని మంత్రి తుమ్మల ప్రత్యేక అభినందనలు తెలిపారు. స్వయంగా ఆయన అందరికి శాలువాలు కప్పి సత్కరించారు. అనంతరం మంచి ఉత్పత్తులు సాధించిన పలువురు రైతులను సత్కరించారు. అనంతరం మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చేసిన అభివృద్ధి, పామాయిల్ విస్తరణలో ఆయన చేసిన అభివృద్ధిపై 'ఆంధ్రజ్యోతి'లో వచ్చిన ప్రత్యేక కథనాన్ని బండి భాస్కరరావును అనే రైతు ఫొటో ఫ్రేమ్ కట్టి మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు అందజేశారు.

అనంతరం ఆయిల్‌పామ్ ఫార్మర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ఆలపాటి రామచంద్ర ప్రసాద్ మాట్లాడుతూ.. ఈ ప్రాంతంలో ఆయిల్‌పామ్ విస్తరణ, ధరలు, ఆఈఆర్‌ను పెంచడం, కేంద్రం నుంచి అనుమతులు పొందడంలో మంత్రి తుమ్మల చేసిన కృషి వర్ణించలేనిదన్నారు. అనంతరం ఆయిల్‌ఫెడ్ జీఎం సుధాకర్‌రెడ్డి, ఓఎస్‌డీ కిరణ్, మహారాష్ట్రకు చెందిన రైతు చంద్రశేఖర్, రవి సీడ్స్ అధినేత రవి, శ్రీనివాసరావు, సురేందర్‌రెడ్డి తదితరులు తమ అనుభవాలను రైతులకు వివరించారు. ఈ కార్యక్రమంలో అశ్వారావుపేట, అప్పారావుపేట ఫ్యాక్టరీ మేనేజర్లు నాగబాబు, కళ్యాణ్, ఆయిల్‌ఫెడ్ సీనియర్ మేనేజర్ శ్రీకాంత్, దమ్మపేట మార్కెట్ కమిటీ చైర్మన్ వాసం రాణి, దమ్మపేట సొసైటీ చైర్మన్ ఎల్లిన రాఘవరావు, రైతులు కొయ్యల అచుతరావు, కాసాని నాగ ప్రసాద్, కెవీ సత్యనారాయణ, పైడి వెంకటేశ్వరరావు, ఎర్ర వంసతరావు తదితరులున్నారు.



మంత్రి తుమ్మల నాగేశ్వరరావుపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం ఫొటో ఫ్రేమ్‌ను మంత్రికి అందజేస్తున్న పామాయిల్ రైతులు

### దేశంలోనే తెలంగాణ ఆయిల్‌ఫెడ్ నెంబర్ వన్‌గా మారడం గర్వంగా ఉంది

● ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి

దేశంలోనే తెలంగాణ ఆయిల్‌ఫెడ్ నెంబర్ వన్‌గా మారడం గర్వంగా ఉందని ఆయిల్‌ఫెడ్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. మొదటిసారిగా నిర్దేశించిన 300 మెట్రిక్ టన్నుల లక్ష్యాన్ని 20 రోజులుండగానే అధిగమించడం.. అలాగే మలేషియాతో పోటీ పడి 20శాతం ఓఈఆర్‌ను సాధించే దిశగా అడుగులు పడడం.. అందుకు కృషి చేసిన ఆయిల్ ఫెడ్ సిబ్బంది, ఉద్యోగులు, అలాగే ప్రతీ క్షణం వెన్నంటి ఉండి అన్ని విధాలా ప్రోత్సహిస్తూ వచ్చిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. పామాయిల్‌తో ఈ ప్రాంత రైతులు ఎంతో అభివృద్ధి చేశారన్నారు. తుమ్మలను చూశాక ఈ ప్రాంతంతో పాటు రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లోని రైతులు తుమ్మల లాగా మారాలన్న ఆశతోనే ఈ పంట విస్తరణకు కంకణం కట్టుకున్నట్లు రాఘవరెడ్డి తెలిపారు. పామాయిల్ ధర, ఓఈఆర్ సాధన, కొత్త ఫ్యాక్టరీల నిర్మాణాలు వంటి వాటిని మంత్రి తుమ్మల సహకారంతో ముందుకు తీసుకెళతామన్నారు. తక్కువ మంది ఉద్యోగులతో ఎక్కువ ఉత్పత్తిని సాధించిన ఆయిల్‌ఫెడ్ సిబ్బంది కృషి అమోఘమన్నారు. త్వరలోనే మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆదేశాలతో ఉద్యోగులకు మంచి ప్రోత్సాహకాలు ఇవ్వనున్నామని, సిబ్బందిని పెంచేందుకు కృషి చేస్తున్నట్టు ఆయన ప్రకటించారు.

### మంత్రి తుమ్మల కృషితోనే పామాయిల్ అభివృద్ధి

● ఎమ్మెల్యే జారే ఆదినారాయణ

పామాయిల్ పంట కన్నతల్లి తండ్రి లాంటిదని, పామాయిల్ వల్లే తాను ఆర్థికంగా నిలదొక్కుకోగలిగానని ఎమ్మెల్యే జారే ఆదినారాయణ అన్నారు. ఈ ప్రాంతంలో మొట్టమొదటిసారిగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పామాయిల్‌ను పరిచయం చేయడమే కాకుండా ఆయన ఏ శాఖలో ఉన్నా స్వయంగా వ్యవసాయం చేయడంతో పాటు పామాయిల్ అభివృద్ధి, విస్తరణపై విశేష కృషి చేశారన్నారు. ఇప్పుడు ఇది తెలంగాణ మొత్తం విస్తరింపచేయడం ఆయన ఘనతేనని అన్నారు. 3లక్షల మెట్రిక్ టన్నులు ఉత్పత్తిని సాధించిన ఆయిల్‌ఫెడ్ అధికారులను ఎమ్మెల్యే అభినందించారు. తన నియోజకవర్గంలో ఆయిల్‌ఫెడ్ ఫ్యాక్టరీలు ప్రపంచంతో పోటీ పడడం, తెలంగాణకు తలమానికంగా ఉండడం తనకెంతో గర్వంగా ఉందన్నారు. పామాయిల్ అభివృద్ధిలో మంత్రి తుమ్మల కృషి ఎనలేనిదన్నారు. ఆయిల్‌ఫెడ్ సీఎస్ఆర్ ఫండ్స్ ద్వారా అప్పారావుపేట గ్రామాన్ని దత్తత తీసుకొని సమస్యలు తీర్చాలని, అలాగే అశ్వారావుపేటలో సెంట్రల్ లైటింగ్ విస్తరణకు కలెక్టర్ సీఎస్ఆర్ నిధులను కేటాయించాలని ఎమ్మెల్యే కోరారు. మల్బరీ తోటల విస్తరణ, అశ్వారావుపేటలో ఉద్యాన కళాశాలను ఏర్పాటు చేయాలని ఆయన మంత్రి తుమ్మలకు విన్నవించారు. అలాగే ములకలపల్లిలో ఆయిల్‌పామ్ ఫ్యాక్టరీని మంజూరు చేయాలని మంత్రిని కోరారు.

### ఇక్కడ రైతులను చూస్తే గర్వంగా ఉంది

● భద్రాద్రి కలెక్టర్ జితేష్ వి పాటిల్

ఉమ్మడి జిల్లా రైతులను చూస్తే ఎంతో గర్వంగా ఉందని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ జితేష్ వీ పాటిల్ అన్నారు. వ్యవసాయంలో అనుభవంతో పాటు ఎన్నోరకాల కొత్తరకాల పంటలు సాగు, అనుబంధ పరిశ్రమల ఏర్పాటు ద్వారా ఇక్కడి రైతులు ముందున్నారన్నారు. రైతులు ఉద్యాన పంటలు, పామాయిల్‌తో పాటు వెదురు, ములగ తోటలను వేసుకోవాలన్నారు. ప్రభుత్వం మల్చింగ్, డ్రిప్‌తో పాటు వివిధ రకాల రాయితీలను అందిస్తుందని, ఉపాధి హామీ కింద కూడా ప్రోత్సాహం అందజేస్తుందన్నారు. మేకల పెంపకం, కముజు పిట్టల పెంపకం వంటి యూనిట్‌లను ఏర్పాటు చేసుకోవాలని కోరారు. ఆయిల్‌ఫెడ్ అధికారులు ఉత్పత్తి లక్ష్యాన్ని అధిగమించడం ఎంతో గర్వకారణంగా ఉందన్నారు. ఉద్యాన రైతులకు ఎంతో భవిష్యత్, స్వేచ్ఛ ఉంటుందని.. అలాగే కుటుంబం అభివృద్ధికి ఎంతో సహకారంగా ఉంటుందన్నారు. ముఖ్యంగా రైతులు సేంద్రీయ ఎరువుల వాడకాన్ని పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు.

# ఇసుక అక్రమ సంపాదనపై సీబీసీఐడీతో విచారణ జరపాలి

» సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర సెక్రటరియేట్ సభ్యుడు రంగారెడ్డి

భద్రాచలం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇసుక కాంట్రాక్టర్ల అక్రమ సంపాదనపై సీబీసీఐడీ విచారణ జరిపించాలని సీపీఐఎంఎల్ మాస్‌లైన్ పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కెచ్చెల రంగారెడ్డి డిమాండ్ చేశారు. భద్రాచలంలో ఆదివారం సీపీఐఎంఎల్ మాస్‌లైన్ డివిజన్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మితిమీరిన ఇసుక బరువు లారీల రవాణా వలన భద్రాచలం-చర్ల రహదారి విధ్వంసం అవుతున్నా ప్రజా ప్రతినిధులు, అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. సీతమ్మసాగర్ పనులు ఆగిపోయినప్పటికీ డిసిల్టేషన్ పూడికతీత పేరుతో టీజీఎండీసీ అధికారులు చర్ల మండలంలో ఇష్టానుసారంగా ఇసుక తవ్వకాలకు అనుమతులు ఇచ్చారని, దీంతో ప్రజా జీవనం అస్తవ్యస్తమవుతోందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి ఇసుక అక్రమ రవాణాను అరికట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కెచ్చెల కల్పన, దాసరి సాయి, మునిగెల శివ ప్రశాంత్ పాల్గొన్నారు.



# రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ఉపాధ్యాయుల విదేశీ టూర్..

**ఉపాధ్యాయుల ఎంపిక కోసం మార్గదర్శకాలు జారీ**

**కలెక్టర్ చైర్మన్‌గా కమిటీ నియామకం**

**పారదర్శకంగా ఎంపిక చేయాలి : ఉపాధ్యాయ సంఘాలు**

కొత్తగూడెం ఎడ్యుకేషన్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఉన్నతమైన విలువలు కూడిన విద్యను విద్యార్థులకు అందించడానికి వీలుగా ఉత్తమ బోధనా, శాస్త్రీయ విద్యా విధానంతో పాటు ఇతరత్రా విషయాలపై అవగాహన కలిగించడం కోసం రాష్ట్ర విద్యాశాఖ ఉపాధ్యాయులకు విదేశీ సందర్శనకు అవకాశం కల్పిస్తూ ఈ నెల 10వ తేదీన ఉత్తర్వులు జారీ చేసింది. నాలుగు దశల్లో 160 మంది ఉపాధ్యాయులను విదేశాలకు పంపనున్నారు. మొదటిదశలో భద్రాద్రి జిల్లా నుంచి ముగ్గురు ఉపాధ్యాయులను ఎంపిక చేయాలని సూచించారు. ఈ ముగ్గురులో ఒకరు ఎస్‌జీటీ, ఎల్‌పీ.పీఈటీల నుంచి, మరొకరిని స్కూల్ అసిస్టెంట్, పీజీటీల నుంచి, హెడ్‌మాస్టర్, ప్రిన్సిపాల్స్ నుంచి ఒకరిని ఎంపిక చేయాల్సి ఉంటుంది. భద్రాద్రి జిల్లాలోని ప్రభుత్వ రెసిడెన్షియల్, కేజీబీవీల నుంచి ఉపాధ్యాయులను ఎంపిక చేయాల్సి ఉంటుంది. అలా మొదటిదశలో రాష్ట్రం నుంచి ఎంపిక చేసిన 40మంది ఉపాధ్యాయులను అక్టోబరు నెలాకరు గానీ నవంబరు మొదటి వారంలో గానీ సింగపూర్, ఫిన్‌ల్యాండ్, వియత్నాం, జపాన్ దేశాల పర్యటనకు పంపనున్నారు. ముందుగా జిల్లా, రాష్ట్ర, జాతీయస్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయులను విదేశాలకు పంపుతామని విద్యాశాఖ అధికారులు తెలిపారు. తాజాగా జిల్లా స్థాయిలో ఓ కమిటీని ఏర్పాటు చేసి, విదేశీ పర్యటనకు ఉపాధ్యాయులను ఎంపిక చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొంది. ఈ కమిటీలో చైర్మన్‌గా జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి, జిల్లా కలెక్టర్ నామినేట్ చేసిన వ్యక్తి కమిటీ సభ్యులుగా వ్యవహరిస్తారు.

**ఇవే మార్గదర్శకాలు**

విదేశాలకు ఎంపిక చేసే ఉపాధ్యాయుల విషయంలో విద్యాశాఖ కొన్ని మార్గదర్శకాలు విడుదల చేసింది. ఉపాధ్యాయుడి వయస్సు 55ఏళ్లలోపు ఉండి, కనీసం 10ఏళ్ల సర్వీసు ఉండాలి. వారు పాస్‌పోర్టు కలిగి ఉండాలని, ఎటువంటి ఎంక్వైరీలు ఉండరాదు. మెడికల్ ఫిట్‌నెస్ కలిగి ఉండాలని, ఎలాంటి క్రానికల్ వ్యాధులు ఉండరాదు. వీటితో పాటు ఉపాధ్యాయుడు క్వాలిటీ ఎడ్యుకేషన్, లెర్నింగ్ అవుట్‌కమ్స్, విద్యార్థుల ఎన్‌రోల్‌మెంట్స్, డ్రాప్‌అవుట్స్, వృత్తి పరమైన అభివృద్ధి, అకాడమిక్ అభివృద్ధి, పాఠశాల అభివృద్ధి, ఇన్నోవేషన్ ప్రాక్టీస్ ఇన్‌క్లాస్‌రూమ్, అవార్డులు.. రివార్డులు, కమ్యూనికేషన్ స్కిల్స్, గ్లోబల్ రీడింగ్ తదితర అనుభవాలను గత మూడేళ్ల నుంచి పరిగణలోనికి తీసుకుంటారు.



**నిష్పక్షపాతంగా ఎంపిక చేయాలి**

విదేశీ సందర్శన కోసం ఎంపిక చేసే విధానం పారదర్శకంగాను, నిష్పక్షపాతంగా జరగాలని ఉపాధ్యాయ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. గతంలో జిల్లా, రాష్ట్రస్థాయిలో జరిగిన ఉత్తమ ఉపాధ్యాయుల ఎంపికలో అనేక లోటుపాట్లు ఉన్నాయన్నారు. దరఖాస్తు చేసుకున్న ప్రతీ ఒక్కరినీ ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపిక చేయడం పట్ల తీవ్ర విమర్శలు, అపవాదులు చోటు చేసుకున్నాయి. ఈసారి ఎంపికలో ఎలాంటి పొరపాట్లు జరగకుండా చూడాలని ఉపాధ్యాయ సంఘాలు కోరుతున్నాయి.

**ఉపాధ్యాయుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుంది**

విదేశాల సందర్శన కోసం ఉపాధ్యాయుల ఎంపిక విధానం కమిటీ చైర్మన్‌గా వ్యవహరించే కలెక్టర్ నేతృత్వంలో పారదర్శకంగా జరుగుతుంది. రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు పారా మీటర్ల ప్రకారం ప్రతీ ఉపాధ్యాయుడికి సంబంధించి పూర్తి వివరాలు పరిశీలించడం జరుగుతుంది. జిల్లా కమిటీ వారు ఎంపిక చేసిన పేర్లను మాత్రమే రాష్ట్రానికి ప్రతిపాదించడం జరుగుతుంది. కమిటీలో కలెక్టర్ చైర్మన్, సభ్యులుగా అదనపు కలెక్టర్, జిల్లా విద్యాశాఖ అధికారి, మరొక జిల్లాస్థాయి అధికారి సభ్యులుగా ఉంటారు.

- బి.నాగలక్ష్మి, డీఈవో, భద్రాద్రి జిల్లా

## హైకోర్టు స్టేను నిరసిస్తూ 18న రాష్ట్రవ్యాప్త బంద్

**బీసీ సంక్షేమ సంఘ జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు**



మాట్లాడుతున్న నారాయణవరపు

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 11 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ తీసుకువచ్చిన జీవో నంబరు 9పై హైకోర్టు స్టే ఇవ్వడాన్ని నిరసిస్తూ ఈనెల 18న తలపెట్టిన రాష్ట్రవ్యాప్త బంద్‌ను జయప్రదం చేయాలని బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో పలు రాజకీయ పార్టీలు, కులసంఘాల నాయకులతో ఆయన సమావేశమయ్యారు. బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలని ఇటీవల కాంగ్రెస్ ప్రభుత్వం జీవోను తీసుకువచ్చిందని, ఇందుకు నిరసనగా నిర్వహించే బంద్‌లో రాజకీయాలు, కులమతాలకు అతీతంగా ప్రతిఒక్కరూ పాల్గొవాలని ఆయన కోరారు. నాయకులు దండు ఆదినారాయణ, కొలికపోగు సర్వేశ్వరరావు, అప్పారావు, దుస్సా వెంకటేశ్వర్లు, షరీఫ్, దాసు, పిల్లి కవితా మల్లిక్, దార్ల రవి తదితరులు పాల్గొన్నారు.

## న్యాయమూర్తులపై దాడి అనాగరికం

**మాల మహానాడు అధ్యక్షుడు పిల్లి కవితా మల్లిక్**



సత్తుపల్లిలో మహానాడు నాయకుల నిరసన

సత్తుపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కోర్టు ప్రాంగణంలోనే న్యాయమూర్తులపై దాడిచేయడం అనాగరికమని సత్తుపల్లి మాలమహానాడు అధ్యక్షుడు పిల్లి కవితా మల్లిక్ అన్నారు. సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్.గవాయిపై దాడిచేయడాన్ని నిరసిస్తూ ఆదివారం స్థానిక అంబేద్కర్ విగ్రహంవద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ రకమైన దాడులు మరలా జరగకుండా భద్రతను కట్టుదిట్టం చేయడంతోపాటు అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. ఈ క్రమంలో ప్రభుత్వాలు కఠిన చట్టాలు రూపొందించి భారత రాజ్యాంగం పట్ల ప్రజల్లో విశ్వాసం పెంచాలని కోరారు. నక్కా మల్లిఖార్జునరావు, పిల్లి సురేష్, బీ.వెంకటేశ్వరరావు, పిల్లి వెంకటేశ్వర్లు, విజయ్, ఏర్పుల ఆనంద్, మోషే, వేము రమేష్, సాలి పవన్, నక్కా మోహనరావు, కటుకూరి కృష్ణ, అబ్రహాం, చింతా భీమయ్య, బాలశౌరి, రాంబాబు, సూర్య తదితరులు పాల్గొన్నారు.

# డైలీవేజ్ వర్కర్ల సమ్మె మరింత ఉధృతం

**నేటి నుంచి ఐటీడీఏ కార్యాలయం ఎదుట 72 గంటల పాటు నిరసన**

**హాజరు కానున్న వివిధ రాజకీయ, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులు**

భద్రాచలం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ డైలీవేజ్ వర్కర్ల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ గత 30 రోజులుగా నిరవధిక సమ్మె నిర్వహిస్తున్నా ప్రభుత్వం, ఉన్నతాధికారులు స్పందించకపోవడంతో నిరవధిక సమ్మె మరింత ఉధృతం కానుంది. 30 రోజులుగా సమ్మె చేస్తున్న నేపథ్యంలో దసరా పండుగను పురస్కరించుకొని ప్రభుత్వం నాలుగు నెలల పెండింగు జీతాలు వేసారు. ఇందులో కూడా రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో జిల్లా కలెక్టర్ గెజిట్‌ను అనుసరించి పాత జీతాలు చెల్లించగా భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం జిల్లాలకు మాత్రం జీవో నెం.64 అనుసరించి వేతనాలను భారీగా తగ్గించారు. దీని వలన ఒక్కొక్క కార్మికుడు నెలకు రూ.16 వేలు చొప్పున నష్టపోయారని జేఏసీ వాపోతోంది. అదే విధంగా అవుట్‌సోర్సింగ్ వర్కర్లకు మహబూబాబాద్, ములుగు, అసిఫాబాద్, అదిలాబాద్ జిల్లాల్లో జీవో నెం.60 ప్రకారం రూ.15,600 వేతనం చెల్లిస్తుండగా ఉమ్మడి జిల్లాలో మాత్రం రూ.9,200 వేతనం మాత్రమే చెల్లిస్తుండటం బాధాకరమన్నారు. ఉప ముఖ్యమంత్రితో సహా ముగ్గురు మంత్రులు ప్రాతినిధ్యం వహిస్తున్న ఉమ్మడి జిల్లాలో కార్మికుల వేతనాలు తగ్గడం పట్ల జేఏసీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తోంది. ఈ క్రమంలో సోమవారం నుంచి భద్రాచలం ఐటీడీఏ కార్యాలయం ఎదుట నిరవధిక సమ్మెలో భాగంగా 72గంటల పాటు నిరసన నిర్వహించనున్నట్లు తెలంగాణ గిరిజన ఆశ్రమ పాఠశాలల వసతి గృహాల డైలీవేజ్ వర్కర్ల జేఏసీ పేర్కొంది. డైలీవేజ్ వర్కర్ల టైంస్కేలు అమలు చేయాలని, పర్మినెంట్ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు. రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ రూ.10 లక్షలు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం కల్పిస్తూ ఉద్యోగ భద్రత కల్పించాలని, 12 నెలల వేతనాలు (దసరా, సంక్రాంతి, వేసవి సెలవులు) కలుపుకొని ఇవ్వాలని ఈ సందర్భంగా వారు డిమాండ్ చేస్తున్నారు. వేతనాలతో కూడిన వారాంతపు సెలవులు అమలు చేయాలని, కొత్త మెనూ వలన పెరిగిన పని భారానికి అనుగుణంగా కార్మికుల సంఖ్యను పెంచాలని డైలీవేజ్ వర్కర్ల జేఏసీ కోరుతోంది. ఇదిలా ఉండగా సోమవారం నుంచి నిర్వహించే 72గంటల నిరసన కార్యక్రమంకు వివిధ రాజకీయ పక్షాలు, ఉపాధ్యాయ, విద్యార్థి సంఘాల నాయకులు కూడా తరలిరానున్నట్లు జేఏసీ నాయకులు తెలిపారు.



నిరసన తెలుపుతున్న డైలీవేజ్ కార్మికులు

# ముగిసిన రాష్ట్రస్థాయి టీటీ పోటీలు

ఖమ్మం స్పోర్ట్స్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఖమ్మం నగరంలోని సర్దార్‌పటేల్ స్టేడియంలోని టీటీ ఇండోర్ హాల్‌లో గత మూడు రోజులుగా జరిగిన బాలసాని సన్యాసయ్య మెమోరియల్ రాష్ట్రస్థాయి ర్యాంకింగ్ టేబుల్ టెన్నిస్ పోటీలు ఆదివారం ముగిశాయి. ఈ పోటీల్లో అండర్- 11 బాల, బాలికల విభాగం నుంచి సీనియర్ మెన్ అండ్ ఉమెన్, 45 సంవత్సరాలపై నుంచి 80 సంవత్సరాల వయస్సు గల వారికి మొత్తం 11 కేటగిరీలలో పోటీలు నిర్వహించారు. మూడు రోజులుగా హోరా హోరీగా జరిగిన పోటీలలో ప్రతీ మ్యాచ్ ఆద్యంతం ఉత్కంఠగా జరిగింది. పోటీల్లో రాష్ట్ర ర్యాంకింగ్‌లో అగ్రస్థానంలో ఉన్న స్టార్ ప్లేయర్స్ సైతం పాల్గొని తమ ప్రతిభా పాటవాలను ప్రదర్శించారు. పోటీల అనంతరం ఖమ్మం నగర మేయర్ పునకొల్లు నీరజ, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ యువ నాయకుడు తుమ్మల యుగంధర్‌లు ముఖ్య అతిధులుగా పాల్గొని విజేతలకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రీడలతో మానసిన ఉల్లాసం ఏర్పడుతుందన్నారు. గెలుపోటములతో సంబంధం లేకుండా క్రీడాస్ఫూర్తితో పోటీపడాలన్నారు. ఈ సందర్భంగా విజేతలను వారు అభినందించారు. కార్యక్రమంలో రాష్ట్ర టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు కేకే.మహేశ్వరి, సెక్రెటరీ నాగేందర్‌రెడ్డి, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బాలసాని విజయ్, ఓలేటి సాంబమూర్తి తదితరులు ఉన్నారు.



విజేతలకు బహుమతులు ప్రధానం చేస్తున్న రాష్ట్ర టేబుల్ టెన్నిస్ సంఘం బాధ్యులు

**విజేతలు : బాలికల విభాగంలో**

అండర్-11 విభాగంలో అపర్ణ ప్రథమ బహుమతి సాధించగా యశశ్రీ ద్వితీయ బహుమతి సాధించింది.

అండర్-13 విభాగంలో అవంతిక ప్రథమ, మహిమక్రిష్ణ ద్వితీయం, అండర్-15 విభాగంలో మహిమక్రిష్ణ ప్రథమ, గాయత్రీ ద్వితీయం, అండర్-17 విభాగంలో అవంతిక ప్రథమ, జలని ద్వితీయం, అండర్-19 విభాగంలో శ్రేష్ఠ ప్రథమ బహుమతి సాధించగా, వైష్ణవి ద్వితీయ బహుమతులు సాధించారు.

**బాలుర విభాగంలో..**

అండర్-11 విభాగంలో విహాన్ ప్రథమ, నివాన్ ద్వితీయ, అండర్-13 విభాగంలో విరాట్ సాగర్ ప్రథమ, వేదాన్ష్ ద్వితీయ, అండర్-15 విభాగంలో విలోహిత్ ప్రథమ, ప్రమాణ్ ద్వితీయ, అండర్-17 విభాగంలో ధర్మతేజసాయి ప్రథమ, హనీష్ ద్వితీయ, అండర్-19 విభాగంలో ఆరుష్‌రెడ్డి ప్రథమ, దేవాన్ష్‌సింగ్ ద్వితీయ బహుమతులు సాధించారు. మెన్స్ విభాగంలో స్వర్ణేందు చౌదరి విన్నర్ కాగా వరుణ్ శంకర్ రన్నరప్‌గా నిలిచారు. ఉమెన్స్ విభాగంలో నిఖితాభాను విన్నర్, వరుణిజైస్వాల్ రన్నరప్‌గా నిలిచారు.

## రేపు ఉమ్మడి జిల్లా వాలీబాల్ జట్ల ఎంపికలు

చుంచుపల్లి, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి జిల్లా అండర్ -17 బాల, బాలికల వాలీబాల్ ఎంపికలు మంగళవారం నిర్వహించనున్నామని ఖమ్మం, భద్రాద్రి జిల్లాల విద్యాశాఖ అధికారులు శ్రీజ, బి.నాగలక్ష్మిలు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అండర్ -17 క్రీడాకారులు 6వ తరగతి ఆపైన చదువుతూ 2009 జనవరి1 తరువాత జన్మించిన వారై ఉండాలన్నారు. ఉదయం 9గంటలకు కొత్తగూడెం ప్రకాశం స్టేడియంలో జరిగే ఈ పోటీల్లో సకాలంలో హాజరు కావాలన్నారు. మరిన్ని వివరాలకు 9951274678 నంబర్‌ను సంప్రదించాలని భద్రాద్రి ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ వాసిరెడ్డి నరేష్‌కుమార్ తెలిపారు. క్రీడాకారులు ఫొటోతో కూడిన ఎలిజిబిలిటీ ఫామ్‌తో హాజరు కావాలన్నారు.

## అన్నదమ్ముల ఆస్తి వివాదంలో రగడ

**పక్క జిల్లా నుంచి కొంతమంది గుండాల రాక?**

ఖమ్మంక్రైం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): శనివారం ఖమ్మంలో జరిగిన అన్నదమ్ముల ఆస్తివివాదంలో కొంతమంది కాంగ్రెస్ నాయకులు కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల భర్త అయిన మిక్కిలినేని నరేంద్ర కారును అడ్డగించి బెదిరించారన్న సంఘటనపై ఖమ్మం టూటౌన్ పోలీసుస్టేషన్‌లో కేసు నమోదైన విషయం విదితమే. కాగా ఆదివారం గట్టయ్యసెంటర్ సమీపంలోని ఓ ప్రాంతంలో అన్నదమ్ముల ఆస్తి పంపకంపై ఇరువర్గాల మధ్య ఘర్షణకు పాల్పడ్డారు. దీంతో పోలీసులు చేరుకుని దాడులు చేసిన వారిని అదుపులోకి తీసుకుని స్టేషన్‌కు తరలించారు. ఈ క్రమంలో పోలీసులను కూడా వారు అడ్డుకునేందుకు ప్రయత్నించారు. అక్కడ జరిగిన ఘర్షణంతా ఓ అపార్టుమెంట్ సీసీ కెమెరాలో రికార్డు కావడంతో అది సోషల్‌మీడియాలో వైరల్‌గా మారింది. కాగా ఈ ఘటనలో మహబూబాబాద్ జిల్లా డోర్నకల్‌కు చెందిన పలువురు ఖమ్మం చేరుకుని ఘర్షణకు దిగినట్టు సమాచారం. ఇదే క్రమంలో ఇరువర్గాల మధ్య వాగ్వాదం జరిగినట్టు తెలిసింది. ఈ వివాదంలో పలువురిని అరెస్టు చేయాలని డిమాండ్ చేసిన డివిజన్ కార్పొరేటర్ మంజుల ఆందోళనకు దిగడంతో ఆమెతో పాటు ఆమె భర్త నరేంద్రను ముందస్తు చర్యల్లో భాగంగా పోలీసులు అదుపులోకి తీసుకుని రఘునాధపాలెం పోలీసుస్టేషన్‌కు తరలించారు. ప్రత్యర్థి వర్గీయులను కూడా పోలీసులు అదుపులోకి తీసుకుని ఈ సంఘటనపై విచారణ సాగిస్తున్నారు. కాగా కార్పొరేటర్ మంజుల పోలీసులకు వ్యతిరేకంగా ఓ సెల్ఫీ వీడియో విడుదల చేశారు.

## అక్రమంగా తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ల సీజ్


చింతకాని, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గంధసిరి మున్నేటి నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న 3 ట్రాక్టర్లను ఆదివారం ఎస్‌ఐ వీరేందర్ పట్టుకున్నారు. ఎలాంటి అనుమతి పత్రాలు చూపక పోవడంతో ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లపై కేసు నమోదు చేశారు. ఈ మేరకు ట్రాక్టర్లను సీజ్‌చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనుమతులు లేకుండా అక్రమ ఇసుక రవాణా జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ట్రాక్టర్లను సీజ్ చేస్తున్న పోలీసులు

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి

కరకగూడెం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అరెంవారి గుంపు గ్రామానికి చెందిన కొమరం మహేష్ (26) అనే యువకుడు విద్యుదాఘాతంతో మృతిచెందిన సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కరకగూడెం మండలంలో ఆదివారం జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం.. అరెంవారి గుంపు గ్రామానికి చెందిన కొమరం పుల్లయ్య, బాయమ్మ దంపతుల చిన్న కుమారుడు మహేష్ ఆదివారం పొలంకు నీరు పారించేందుకు పెద్దవాగు వద్ద మోటర్‌కు విద్యుత్ తీగలను అమర్చే క్రమంలో ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై వాగు నీటిలో పడి మృతి చెందాడు. రాత్రి వరకు మహేష్ ఇంటికి రాక పోవడంతో అన్న నరేష్ వెతుకుంటూ వెళ్లి చూడగా వాగులో తమ్ముడు మహేష్ మృతి చెంది పడినట్లు గుర్తించాడు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు కేసు నమోదు చేసి శవ పరీక్ష నిమిత్తం మణుగూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. మహేష్ మృతితో ఆ గ్రామంలో విషాదఛాయాలు అలుముకున్నాయి.



మహేష్ (ఫైల్)

# బాక్సింగ్ క్రీడతో ఉజ్వల భవిష్యత్తు

**తెలంగాణ రాష్ట్ర బాక్సింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు బండారి ఎల్లయ్య**

కొత్తగూడెం పోస్టాఫీస్ సెంటర్, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): బాక్సింగ్ క్రీడతో ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలని తెలంగాణ బాక్సింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షులు బండారి ఎల్లయ్య ఆదివారం అన్నారు. కొత్తగూడెం ప్రగతి మైదానంలో, రామవరంలో కొనసాగుతున్న ఉమ్మడి ఖమ్మం జిల్లా బాక్సింగ్ శిక్షణ తరగతుల పర్యవేక్షణలో భాగంగా జిల్లాకు విచ్చేసి పర్యవేక్షించి మాట్లాడారు. ఈ సందర్భంగా... ప్రపంచంలోని కొన్ని చిన్న దేశాల పేర్లను సైతం గుర్తు పెట్టుకోవడానికి అక్కడి ప్రజలు క్రీడల్లో రాణించడమే కారణమన్నారు. బాక్సింగ్ సాధనలో భాగంగా విద్యార్థులకు బాక్సింగ్‌లో గెలుపొందుటకు మెలుకువలు నేర్పించారు. తల్లిదండ్రులు పిల్లలను చదువుకే పరిమితం చేయకుండా క్రీడల్లోనూ ప్రోత్సహించాలని కోరారు. ఒలింపిక్స్‌లో కూడా బాక్సింగ్ క్రీడ ఉన్నందున క్రీడాకారులకు ఉద్యోగ అవకాశాలు త్వరగా లభిస్తాయని తెలిపారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం, రామవరం, భద్రాచలం ప్రాంతాల్లో బాక్సింగ్ శిక్షణ తరగతులు నిర్వహించడం జరుగుతుందని ఆసక్తి కలిగిన వారికి ఉచితంగా శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. త్వరలో ఇల్లందు, మణుగూరులలో బాక్సింగ్ శిక్షణ తరగతులు ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బాక్సింగ్ చీఫ్ ప్యాట్రన్ యెర్రా కామేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శివ, సుబ్రమణ్యం, కోచ్‌లు ఈశ్వర్, సాగర్, కిరణ్, శ్రీమూర్తులు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.



కొత్తగూడెంలో బాక్సింగ్ క్రీడా తరగతులను పర్యవేక్షిస్తున్న రాష్ట్ర బాక్సింగ్ ఫెడరేషన్ ఉపాధ్యక్షుడు బండారి ఎల్లయ్య

# ఎస్సీ వర్గీకరణ ఓ రాజకీయ కుట్ర

**మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్**

ఖమ్మంచర్చికాంపౌండ్, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): ఎస్సీవర్గీకరణ పేరుతో దళితుల ఐక్యతపై అతిపెద్ద రాజకీయ కుట్ర జరిగిందని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు అండ్ రాక్స్ డాక్టర్ ఆర్ఎస్ రత్నాకర్ అన్నారు. ఆదివా రం నగరంలోని ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చట్టాలు అయిపోయినవని ప్రజలను అనుకోవద్దని, ప్రజలు తలుచుకుంటే ఏచట్టాలనైనా ప్రజాస్వామ్యంలో వెనక్కి తీసుకోవాల్సిందేన్నారు తెలుగురాష్ట్రాల్లో అన్ని రాజకీయపార్టీలు మాల మాల సామాజికవర్గాన్ని టార్గెట్‌చేసి తొక్కేస్తా ఉంటే మాల ప్రజాప్రతినిధు లు మాత్రం నోరు మెదపకపోవడం అన్యాయమన్నారు. ఇకనైనా కళ్లు తెరిచి మాల ఉద్యోగులు, మాల కులస్తులు పోరాటాలకు మద్దతు ఇవ్వాలని, గొంతెత్తి బయటకు వచ్చి మాట్లాడాలని కోరారు. శాంతియుత పోరాటానికి మాల కులస్తుందరు సిద్ధంకావాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ సమావే శంలో కామ ప్రభాకరావు, బల్లెం లక్ష్మణ్, మిరియాల బాలశౌరి, తోట దుర్గాప్రసాద్, తనికెళ్ల నాని, నెల్లి సూరిబాబు పాల్గొన్నారు.

## ఊసిరి కాయ పచ్చడి కోసం వస్తూ...

# రోడ్డు ప్రమాదంలో తండ్రి మృతి

**కుమారుడికి తీవ్ర గాయాలు**

**ప్రమాదానికి కారణమైన ఆగి ఉన్న లారీ**

బోనకల్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఉసిరి కాయ పచ్చడి పెట్టించుకు నేందుకు గానూ తమ స్వగ్రామానికి ద్విచక్ర వాహనంపై బయలు దేరారు తండ్రి, కుమారుడు. మూడు కిలో మీటర్ల దూరం ప్రయాణిస్తే తమ ఇంటికి చేరుకునేవారు. ఇంతలో ఆగిఉన్న లారీ రూపంలో మృత్యువు వెంబడించడంతో తండ్రి కానరాని లోకాలకు వెళ్లగా, కుమారుడి పరిస్థితి కూడ ఆందోళనకరంగా మారింది. ఆదివారం సెలవు కావడంతో కొద్ది నిమిషాల వ్యవధిలో గ్రామానికి చేరుకునే వారు రోడ్డు ప్రమాదానికి గురి కావడంతో బోనకల్ మండలం ముష్టికుంట్ల గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ప్రమాదానికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బంధం నాగేశ్వ రరావు, అచ్చమ్మ దంపతుల కుమారుడు లక్ష్మీనారాయణ(45) కొన్నిఏళ్ల క్రితం నుంచి ఖమ్మంలో నివాసముంటున్నాడు. కొణి జర్ల మండలంలో ఈజీఎస్ టెక్నికల్ అసిస్టెంట్‌గా పని చేస్తున్నాడు. ఆదివారం సెలవు కావడంతో స్వగ్రామంలో ఉన్న తల్లితో పచ్చడి పెట్టించుకునేందుకు గానూ ఉసిరికాయలు తీసుకున్నాడు. ద్విచక్ర వాహనంపై తనతో పాటు కుమారుడు గగన్‌ను ఎక్కించుకొని బయలు దేరాడు. ఈ క్రమంలో చింతకాని మండలం నాగులవంచ సాగర్ కాలువ సమీపంలో ప్రధా న రహదారి పక్కన ఆగిఉన్న లారీని ఢీకొట్ట డంతో తండ్రి, కుమారుడికి తీవ్ర గాయాల య్యాయి. అదే సమయంలో అటుగా వెళ్తున్న ఏఎస్ఐ లక్ష్మణ్ చౌదరి పోలీసు వాహనాన్ని ఆపి అందులో వారిని ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ లక్ష్మీనారాయణ మృతి చెందాడు. కుమారుడు గగన్ పరిస్థితి కూడ ఆందోళనకరంగా ఉండటంతో అతడిని కుటుంబ సభ్యులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. సంఘటనా స్థలాన్ని చింతకాని ఎస్ఐ వీరేందర్ సందర్శించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నారు.



లక్ష్మీనారాయణ (ఫైల్)

## అనారోగ్యంతో మున్సిపల్ కార్మికుడి మృతి

ఇల్లెందుటౌన్, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): ఇల్లెందు మున్సిపల్‌లో పర్మినెంట్ కార్మికుడు పంబాల ప్రసాద్(48) కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం తెల్లవారుజామున మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం ప్రసాద్ మున్సిపాలిటీలో అకౌంట్ సెక్షన్‌లో పంపు బిల్లులు వసూలు చేసేవాడు. కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతుండంతో కుటుంబ సభ్యులు ఖమ్మం, హైదరాబాద్ నిమ్స్‌లో వైద్యం అందించారు. రెండు రోజుల క్రితం నిమ్స్ వైద్యులు ప్రసాద్ ఆరోగ్యం విషమంగా ఉందని, ఇంటికి తీసుకెళ్లమని తెలపడంతో ఇంటికి తీసుకరాగా ఆదివారం తెల్లవారు జాముల మృతి చెందాడు. మృతదేహానికి టీయూసీఐ, టీపీయూడబ్ల్యూయూ జిల్లా ఏరియా కార్యదర్శులు యాకుబ్‌షావళి, వేముల గురునాథం, ఏరియా కార్యదర్శి వెంకటేశ్వర్లుతో పాటు తోటి కార్మికులు, మిత్రులు నివాళర్పించారు. ఈ మేరకు దహన సంస్కారాలకు రూ.20వేలు శానిటరీ ఎస్ఐ శ్రీనివాస్, మొకద్దం, అంజద్ ఈశ్వర్, లక్ష్మణ్ తదితరులు అందజేశారు. కుటుంబ సభ్యులను మున్సిపల్ అధికారులు, ప్రభుత్వం ఆదుకోవాలని పలువురు కోరారు.



ప్రసాద్ (ఫైల్)

## గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి మృతి

వైరా, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్టేజీ పినపాక సమీపంలో జాతీయ ప్రధాన రహదారిపై శనివారం రాత్రి గుర్తుతెలియని వాహనం ఢీకొని ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తున్న ఉప్పుతల పవన్ (22) మృతిచెందాడు. కొణిజర్లకు చెందిన పవన్ మరొక వ్యక్తి ద్విచక్ర వాహనంపై తల్లాడ నుంచి వైరా వైపు వస్తుండగా గుర్తుతెలియని వాహనం ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పవన్ అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడిన మరో వ్యక్తిని 108లో ఖమ్మం తరలించారు. వైరా ఎస్ఐ పుష్పాల రామారావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## గోదావరిలోకి దూకిన వ్యక్తి గల్లంతు

భద్రాచలం, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): భద్రాచలం గోదావరి వారధిపై నుంచి ఆదివారం ఓ యువకుడు నదిలోకి దూకి గల్లంతయ్యాడు. అతని బంధువులిచ్చిన సమాచారంతో గోదావరిలో గల్లంతైన యువకుడి కోసం పోలీసులు, గజఈతగాళ్లతో గాలిస్తున్నారు. కాగా నదిలోకి దూకిన వ్యక్తి చర్ల రోడ్డు సమీపంలో నివాసం ఉంటున్న సాయిగా ప్రచారం సాగుతోంది. ఇందుకు సంబంధించి వివరాలు తెలియాల్సి ఉంది.

## నేడు కలెక్టరేట్ ముట్టడి

కూసుమంచి, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): రిటైర్డ్ ఉద్యోగుల పట్ల రాష్ట్ర ప్రభుత్వం మొండివైఖరి అవలంబిస్తోందని సంఘం జిల్లా అధ్యక్షుడు కల్యాణం కృష్ణయ్య ఆరోపించారు. ప్రభుత్వ వైఖరి నిరసిస్తూ సోమవారం కలెక్టరేట్ ముట్టడిస్తున్నట్లు తెలిపారు. ఆదివారం మండలంలోని పాలేరులో సర్వసభ్య సమావేశంలో మాట్లాడారు. 2024 మార్చి అనంతరం రిటైర్డ్ అయిన ఉద్యోగులకు నేటివరకు పెన్షన్లు తప్ప ఎలాంటి బకాయిలు చెల్లించలేదని ఆరోపించారు. రిటైర్డ్ ఉద్యోగుల మరణానికి ప్రభుత్వమే బాధ్యత వహించాలని హెచ్చరించారు. వెంటనే బాకాయిలు చెలించాలని, సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు వెల్లంపల్లి రామయ్య, రంగారావు, వెంకటప్పారావు, భాస్కర్‌రెడ్డి, సత్యనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న చిన్ని క్రిష్ణారావు

## 16న ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఎన్నికలు

ఖమ్మంమార్కెట్,అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): ఛాంబర్‌ఆఫ్ కామర్స్ ఎన్నికలు నవంబరు16న జరుగుతాయని ఆసంఘ అధ్యక్ష, కార్యదర్శులు చిన్ని క్రిష్ణారావు, మెంతుల శ్రీశైలం పేర్కొన్నారు. ఆదివారం ఛాంబర్ ఆఫ్ కామర్స్ సర్వసభ్య సమావేశం నగరంలోని వర్తక సంఘ భవన్‌లో జరిగింది. ఈ సందర్భంగా ప్రస్తుత పాలకవర్గం పదవీకాలం ముగియడంతో నవంబరు16న తిరిగి నూతన పాలక వర్గం ఎన్నికలు జరుగుతాయని తెలిపారు. గడిచిన కాలానికి గాను నివేదికలు చదివి వినిపించారు. ఖర్చులు, రాబడులు తెలిపి సభ్యులడిగిన సందేహాలను నివృతి చేశారు. కార్యక్రమంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఉపాధ్యక్షుడు సోమా నర్సింహరావు, సహాయ కార్యదర్శి మన్నెం క్రిష్ణ, ట్రెజరర్ తల్లాడ రమేష్, మాజీ అధ్యక్ష, కార్యదర్శులు కొప్పు నరేష్, గొడవర్తి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## జేఏవో, ఏవోలకు గెజిటెడ్ హోదా కల్పించాలి

- టీజీవో రాష్ట్ర సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావుకు వినతి



వినతిపత్రాన్ని అందిస్తున్న ఉద్యోగులు

ఖమ్మంకలెక్టరేట్, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): మునిసిపల్ శాఖలో పనిచేస్తున్న జేఏవోలకు, ఏవోలకు గెజిటెడ్ హోదాను కల్పించాలని టీజీవో రాష్ట్ర సెక్రటరీ నరల్ ఏలూరి శ్రీనివాసరావును కోరారు. ఏవోల సంఘం నాయకులు శివలింగం ఆధ్వర్యంలో ఆదివారం ఆయనను ఉద్యోగులు కలిసి వినతిపత్రాన్ని అందచేశారు. మునిసిపాలిటీలో పనిచేస్తున్న అర్హులైన వారికి పదోన్నతులు కల్పించాలని కోరారు. జేఏవో, ఏవోలకు గెజిటెడ్ హోదాను కల్పించాలని ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకోళ్లాలని ఏలూరిని కోరారు. ఉద్యోగుల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానని ఏలూరి వారికి తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట టీజీవో జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, మల్లెల రవీంద్రప్రసాద్,సూరంపల్లి రాంబాబు, టీఎన్జీవో జిల్లా కార్యదర్శి కొణిదెన శ్రీనివాసరావు, కొండపల్లి శేషప్రసాద్ న్నారు.

# యాక్షన్ ప్లాన్.. ఓ నటన!

- కేఎంసీలో డివిజన్ స్థాయిలోకి చేరలేని పరిస్థితి
- అధికారులు లేని జోనల్ వ్యవస్థ
- లంచాలమయంగా పారిశుధ్య విభాగం
- నేటినుంచి పక్షం రోజులు ప్రత్యేక డ్రైవ్‌కు కలెక్టర్ పిలుపు

ఖమ్మంకార్పొరేషన్, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): కేఎంసీ అధికారులు ఖమ్మం నగర పాలక సంస్థ పరిధిలోని పారిశుధ్య విభాగంలోని అవినీతి కంపును శుభ్రం చేయలేక పోతున్నారని విమర్శలు వెలువడుతున్నాయి. గతంలో పని చేసిన ఓ అధికారి ఆధ్వర్యంలో ఎక్కడా పైసా అవినీతి ఆరోపణలు బయటకు రాలేదు. కానీ ఇప్పుడు మున్సిపల్ సొంతశాఖ నుంచి వచ్చిన ఒక్కరు ఇద్దరు కాదు ఏకంగా ముగ్గురు అధికారులు కూడా పారిశుధ్య విభాగాన్ని గాడిలో పెట్టలేక పోతున్నారని తెలుస్తోంది. క్షేత్రస్థాయిలో కొబ్బరి బొండాల నుంచి కమర్షియల్ మాల్స్ వరకు వీదులు శుభ్రం చేసే కార్మికుల నుంచి కూడా డబ్బులు వసూళ్లు చేస్తుండటం విశేషం.





ఖానాపురంచెర్వు సమీపంలో పారిశుధ్య వ్యర్థాలు, పర్యవేక్షక అధికారిలేని జోనల్ కార్యాలయం

### అధికారులు లేని జోనల్ వ్యవస్థ

గ్రేటర్ హైదరాబాద్ తరహాలో ఖమ్మం నగరంలో ఐదుజోన్లుగా విభజన చేసేందుకు అధికారులు కసరత్తు చేశారు. ఇప్పటికే బల్లేపల్లి, పాతమున్సిపల్ కార్యాలయంలో రెండు జోనల్ కార్యాలయాను ప్రారంభించారు. విలీన ప్రాంతాల్లో జోనల్ కార్యాలయాలు ఏర్పాటు చేసి శభాష్ అనిపించుకున్నారు. ప్రతీ సోమవారం ప్రజావాణి నిర్వహిస్తున్నారు. కానీ ఆయా జోనల్ కార్యాలయాలకు బాధ్యులను మాత్రం కేటాయించలేదు. పర్యవేక్షణ అధికారుల కేటాయింపు జరిగితే ఆయా డివిజన్లలోని పారిశుధ్యం, అభివృద్ధి, సంక్షేమ పథకాలు పర్యవేక్షణ పెరుగుతుంది. కానీ జోనల్ కార్యాలయాలు ఏర్పడి నెలల గడుస్తున్నా అధికారులకు బాధ్యతలు కేటాయించలేదు. దీంతో ఉన్నతమైన జోనల్ లక్ష్యం నీరుగారుతోంది. కార్యాలయంలో కేటాయించిన ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరు కావటం లేదు.

### పారిశుధ్యంలో అనుభవ లోపం

ఖమ్మం నగరంలో పారిశుధ్య నిర్వాహణకు పారిశుధ్య పర్యవేక్షకులు, ఎన్వీరాన్‌మెంట్ ఇంజనీరు, అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ పర్యవేక్షణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఒక అధికారికి మరోక అధికారికి మధ్య సమన్వయం కుదరటం లేదని విమర్శలు వెలువడుతున్నాయి. ఖమ్మం నగర పాలక సంస్థకు గతంలో సీనియర్ గ్రేడ్ 1 కమిషనర్‌గా పనిచేసిన అధికారులను అసిస్టెంట్ కమిషనర్‌గా బాధ్యతలు కేటాయించేవారు. వారికి ఉన్న క్షేత్రస్థాయి అనుభవంతో జవాన్లు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లుతో సమన్వయం చేసుకొని కమిషనర్ పరిపాలనకు అసిస్టెంట్ కమిషనర్లు సహాయంగా నిలిచేవారు. కానీ ఇప్పుడు ఖమ్మం నగర పాలక సంస్థకు ప్రమోషన్‌పై వచ్చిన అసిస్టెంట్ కమిషనర్, డిప్యూటీ కమిషనర్ ఇద్దరు కూడా క్షేత్రస్థాయిలో అనుభవం లేదు. కార్యాలయంలో విధులు నిర్వహించి ప్రమోషన్‌పై ఖమ్మంలో బాధ్యతలు కేటాయించారు. వీరు జవాన్లు, శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, పారిశుధ్య పర్యవేక్షకులను సమన్వయం చేయలేకపోతున్నారని ఆరోపణలు వ్యాపిస్తున్నాయి.

### కమర్షియల్‌గా మారిన జవాన్లు

కేఎంసీలో కమిషనర్లు, అసిస్టెంట్ కమిషనర్లు బదిలీలు జరుగుతున్నా.. డివిజన్లలో జవాన్లు మాత్రం పక్కడివిజన్‌కు మారేది లేదని భీష్మించుకుంటున్నారు. రాజకీయంగా పలుకుబడిన కలిగిన జవాన్లు గత ప్రభుత్వంలో కమర్షియల్ ప్రాంతాల్లో ఉద్యోగాలు పొందారు. ముఖ్యంగా కమర్షియల్ ప్రాంతాల్లోని డివిజన్లు వ్యాపారులతో కలిసి పోయారని ఆరోపణలు ఉన్నాయి. కొబ్బరి బొండాల దుకాణాల నుంచి అపార్టుమెంట్లు, కమర్షియల్ భవనాల వరకు నెలవారి మూమూళ్లకు అలవాటు పడ్డారనే ఆరోపణలు ఉన్నాయి. నగరంలోని కొబ్బరి బొండాలు అమ్మేవారు నెలకు రూ.3వేల మామూళ్లు జవాన్లు వసూళ్లు చేస్తున్నారంటే పారిశుధ్య అవినీతి తెలిసిపోతుంది. ప్లాస్టిక్ కవర్లు వ్యాపారంపై తెలిసిన కూడా పైస్థాయి అధికారులకు సమాచారం ఇవ్వటం లేదని దాడులకు అధికారులు వెళితే ముందస్తుగానే ఆయా వ్యాపారులకు సమాచారం అందించి అప్రమత్తం చేస్తున్నారు. ఇలాజవాన్లు వసూళ్ల చేసిన డబ్బుల నుంచి శానిటరీ ఇన్స్‌పెక్టర్లు, పారిశుధ్య పర్యవేక్షకుల వరకు పంచుకుంటున్నారు.

### క్షేత్రస్థాయిలోకి చేరని యాక్షన్ ప్లాన్

ఖమ్మంనగరంలో పారిశుధ్య పర్యవేక్షణపై ఇటీవల కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య ప్రత్యేక దృష్టి సారించారు. నేరుగా డివిజన్లలో పర్యటించి పరిశీలన చేసి పలు ఆదేశాలిస్తున్నారు. అయితే ఖమ్మం నగరం సుందరీకరణలో భాగంగా కలెక్టర్ అనుదీప్ వారం రోజులుగా దృష్టి సారించారు. ఇప్పటికే కమిషనర్, ఇంజనీరింగ్ అధికారులతో పలుమార్లు సమావేశాలు నిర్వహించారు. సోమవారం నుంచి పక్షంరోజులు పాటుగా ఖమ్మం నగరంలో ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని ఆదేశించారు. గ్యాంగ్ వర్క్‌ను ఏర్పాటు చేసి పారిశుధ్యం, డ్రెయినేజీలు పరిశుభ్రం, రహదారుల గుంతలు మరమ్మతులు, వీధి దీపాలు అలంకరణ, డివైడర్లు ఆధునికీకరణ, ప్రధాన రహదారుల ఆక్రమణలో తొలగింపువంటి కార్యాచరణ చేశారు. శనివారం నుంచి పనులు ప్రారంభించారు. కాని పారిశుధ్య విభాగంలో మాత్రం ఆదివారం రాత్రి వరకు కలెక్టర్ అనుదీప్, కమిషనర్ అభిషేక్ అగస్త్య ఆదేశించిన యాక్షన్ ప్లాన్ డివిజన్లుకు చేరలేదు. కనీసం కార్పొరేటర్లు సమాచారం అందలేదు. కాగా ఈ విషయాలపై అసిస్టెంట్ కమిషనర్ అనిల్‌ను వివరణకోసం ఆంధ్రజ్యోతి ప్రయత్నించగా స్పందించ లేదు.

## బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

- మాస్‌లైన్ కేంద్రకమిటీ సహాయ కార్యదర్శి పోటు రంగారావు



మాట్లాడుతున్న పోటు రంగారావు

తిరుమలాయపాలెం, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): బీసీలకు 42శాతం రిజర్వేషన్ ప్రకటించాకే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ కేంద్రకమిటీ సహాయ కార్యదర్శి పోటు రంగారావు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం మండలంలోని తెట్టెలపాడులో ఆపార్టీ ముఖ్యకార్యకర్తల సమావేశం అంగడి నరేందర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకివచ్చి 22 నెలలవుతున్నా ఇచ్చిన హామీ అమలు చేయడంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి విఫలమయ్యారన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇస్తామని కపటనాటకాలు ఆడతున్న కాంగ్రెస్, బీజేపీలు పార్టీలు అవలంబిస్తున్న విధానాలు బీసీలను మోసంచేసే విధంగా ఉన్నాయన్నారు. ముఖ్యమంత్రికి చిత్తశుద్ధి ఉంటే బీసీలకు రిజర్వేషన్ అమలుచేయాలన్నారు. ఏపీ, తెలంగాణ సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర కార్యదర్శి పుసులూరి నరేందర్ మాట్లాడుతూ గ్రామపంచాయతీలకు నిధులు లేక పరిపాలన అస్తవ్యస్థంగా మారిందన్నారు. నాయకులు బందెల వెంకయ్య, ఆర్. శివలింగం, కూసు అప్పారావు, మల్లీడి నాగేశ్వరరావు, తిమ్మిడి హనుమంతరావు, కమ్మకోమటి నాగేశ్వరరావు,ఎస్.వెంకటేశ్వర్లు, పుసులూరి గిరి, వెంకటేశ్వర్లు, టి.నాగేశ్వరరావు పాల్గొన్నారు.

## లారీ అండ్ డీసీఎం అసోసియేషన్ కార్యవర్గం ఎంపిక

కల్లూరు, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి) కల్లూరు మండల లారీ అండ్ డీసీఎం అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. ఆదివారం స్థానిక లారీ అండ్ డీసీఎం అసోసియేషన్ కార్యాలయంలో లారీ అండ్ డీసీఎం ఓనర్ల సమక్షంలో ఈ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా బానోతు రాంబాబు, వర్కింగ్ ప్రసిడెంట్‌గా మాడిశెట్టి సురేష్, ప్రధాన కార్యదర్శిగా గుమ్మడి నరేష్, ఉపాధ్యక్షుడిగా పసుపులేటి అచ్యుత్, సహాయకార్యదర్శిగాబోడా మహేష్, కోశాధికారిగా కె వి సత్యనారాయణ, ఆర్గనైజర్‌గా ఎస్‌కె పాషా, మాడిశెట్టి నాగరాజు, పాశం నరిసింహారావు, గుండ్ల కోటేశ్వరరావులు ఎంపికైనారు.లారీ,అండ్‌డీసీఎం ఓనర్ల సంఘం సీనియర్ నాయకులు పసుపులేటి కోటేశ్వరరావు,నీలం వెంకట్రావుపాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న పోలీసులకు సన్మానం

వైరా, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వైరా పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై వెళ్తున్న పోలీసులను ఎస్ఐ పుష్పాల రామారావు ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం సన్మానించారు. ఆరుసంవత్సరాల నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి ఏఎస్ఐగా ఉద్యోగోన్నతి పొంది మహబూబాబాద్‌కు వెళ్తున్న కృష్ణమూర్తిని, ఆరేడేళ్ల నుంచి పోలీస్‌స్టేషన్‌లో రైటర్‌గా విధులు నిర్వహించి బదిలీపై తల్లాడ వెళ్తున్న కానిస్టేబుల్ మాతంగి విజయ్‌ను శాల్స్, పూల మాలలతో సన్మానించారు.

## ఉత్సాహంగా లాఫ్టర్ యోగా జాతీయ సదస్సు



లోగోను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

ఖమ్మంస్పోర్ట్స్, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): నగరంలోని టీఎన్జీవోస్ ఫంక్షన్‌హాలులో ఆదివారం లాఫ్టర్ యోగా జాతీయ సదస్సును ఉత్సాహంగా నిర్వహించారు. సదస్సులో పాల్గొన్న సుమారు 500 మందికిపైగా ఔత్సాహికులు లాఫింగ్ యోగా వల్ల ఉపయోగాలను ప్రయోగాత్మకంగా తెలుసుకున్నారు. సదస్సు ఆద్యంతం నవ్వుతూ, కేరింతలతో సందడి చేసి అలరించారు. బీపీ లేని హ్యాపీ భారత్ అనే కాన్సెప్ట్‌తో సదస్సును నిర్వాహకులు నిర్వహించడం విశేషం. ఈసందర్భంగా లాఫ్టర్‌యోగా జాతీయ శిక్షణకేంద్రం లోగోను వారు ఆవిష్కరించారు. నగరంలోని వెలుగుమట్ల అర్బన్‌పార్క్‌లో ప్రతీనెలా మొదటి, మూడో ఆదివారాలు ఉచిత శిక్షణ తరగుతులు నిర్వహిస్తామని తెలిపారు.కార్యక్రమంలో రాష్ట్ర లాఫింగ్ క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ, సెక్రెటరీ సుదీర్‌గౌడ్, లాఫ్టర్ యోగా సొసైటీ జాతీయ ఛైర్మన్ మరికంటి వెంకట్, క్రిష్ణమూర్తి, శ్రీధరాచారి ఉన్నారు.

## నూతన జాతీయ విద్యా విధానం రద్దుకు ఉద్యమిస్తాం

- సీపీఐ జిల్లా కార్యదర్శి దండి

ఖమ్మంరూరల్, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): జాతీయ నూతన విద్యావిధానం రద్దుకు విద్యార్థులు ఉద్యమించాలని, ఏఐఎస్ఎఫ్ మాజీ రాష్ట్రనాయకుడు, సీపీఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ పిలుపునిచ్చారు. ఏదులాపురం ఏఐఎస్ఎఫ్ గర్ల్స్‌శాఖ మహాసభను ఆదివారం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు నేడు దేశంలో నూతన విద్యావిధానం పేరుతో యూనివర్సిటీల స్వయం ప్రతిపత్తి దెబ్బ తీసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.యూనివర్సీటీలను మూడు, నాలుగు రకాలుగా విభజన చేసి విద్యను కార్పోరేటీకరణ, ప్రైవేటీకరణ, కమర్షలైజేషన్ కాషాయికరణ చేస్తుందన్నారు ఈ విధానాలు ప్రభుత్వం విద్యా వ్యవస్థను ధ్వంసం చేయడానికి తీసుకుంటున్న చర్యలన్నారు. ఆరెస్సెస్ నేపథ్యం ఉన్నవారినే యూనివర్శిటీలలో నియమాకాలు చేస్తుందన్నారు. కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి కనీసం 10శాతం బడ్జెట్ కేటాయింపులు చేయకుండా జీడీపీలో 6శాతం నిధులు కేటాయించకుండా ఎలా నూతన విద్యావిధానం అమలు చేస్తారని ప్రశ్నించారు. దేశచరిత్రను, తెలంగాణ సాయుధ పోరాట వాస్తవాలను వక్రీకరించడంలో బీజేపీ ముందుందని విమర్శించారు. ఈ సమావేశంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి రామకృష్ణ, జిల్లా నాయకులు వెంకటరెడ్డి, ఓరుగంటి మృదుల, సురేందర్, శ్రీనాథ్, షేక్ నాగూల్ మీరా, వంశీ, మనోజ్, ఉపేందర్, వెంకన్న, సాగర్ తదితరులు పాల్గొన్నారు.

## వైరా సీఐ సాగర్ బదిలీ



బదిలీ అయిన సీఐ సాగర్

వైరా,అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): గత మూడు సంవత్సరాల నుంచి వైరా సీఐగా పనిచేస్తున్న నునావత్ సాగర్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వైరా సీఐగా వి.వినయ్‌కుమార్ రానున్నారు. వైరా సీఐ సాగర్‌ను మల్టీజోన్ ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డిప్యూటేషన్‌పై సీఎస్‌బీలో ఉన్న వినయ్‌కుమార్‌ను వైరాకు బదిలీ చేశారు.

## వైద్యశిబిరంలో 145 మందికి పరీక్షలు



రోగులను పరీక్షిస్తున్న వైద్యులు

నేలకొండపల్లి, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): నూతక్కి గంగాధరరావు ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేలకొండపల్లిలోని రావెళ్లభవన్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. ఈశిబిరంలో 145 మంది రోగులకు వైద్యులు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. షుగర్,బీపీ, మూత్ర పిండాలు, మూర్చవ్యాధులు,పక్షవాతంతో పాటుగా సాధారణ రోగాలకు వైద్యులు పరీక్షలు నిర్వహించారు. 39మందికి కంటిపరీక్షలు చేసారు. రూ.100కే నెలకు సరిపడా మందులను అందించారు. డాక్టర్ వినోద్‌బాబు మురకొండ, నెఫ్రాలజిస్ట్, డాక్టర్ అడపా జయశ్రీ, ఆప్తమాలజీలు శిబిరంలో వైద్యసేవలందించారు. నేలకొండపల్లికి చెందిన వ్యాపారి మాటూరి సుబ్రమణ్యం శిబిరానికి వచ్చిన రోగులకు అల్పాహారం అందించారు. శిబిరంలో ఏటుకూరి రామారావు, కొప్పుల వెంకట్రామిరెడ్డి, గుడవర్తి నాగేశ్వరరావు, పాలడుగు పూర్ణచంద్రప్రసాద్‌లు వాలంటీర్లుగా సేవలందించారు. మంకెనపల్లి నర్సింహారావు,సీహెచ్.భాస్కరరెడ్డి, సామాల మల్లికార్జున్, ఏలూరి కోదండరామారావు, వల్లంచెట్ల భాస్కరరావు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణానికి పోరాటం

**కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల**

రఘునాథపాలెం, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రశాంతంగా ఉండే ప్రాంతంలో నెల రోజులకు పైగా అశాంతి నెలకొంటుందని, ఆలజడి సృష్టించేవారిని అదుపులోకి తీసుకొమని పోలీసులకు ఫిర్యాదులు చేస్తే ఫిర్యాదు చేసిన తమను పోలీసుస్టేషన్‌కు తరలించారని ఖమ్మం 54వ డివిజన్ కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల ఆరోపించారు. ఆదివారం రఘునాథపాలెం తహసీల్దారు కార్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. డివిజన్‌లోని ఓ నివాసంలో కుటుంబాన్ని బయటకు పంపి ఇతరులు ఆక్రమించుకున్నారని, ప్రశాంతంగా ఉండే డివిజన్‌లో ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యక్తులు రాత్రింబవళ్లు ఆలజడులు సృష్టిస్తున్నారని, ప్రజలు ప్రశాంతంగా సాయిబాబా దేవాలయం వద్దకు వెళ్లే పరిస్థితి లేదన్నారు. స్థానిక డివిజన్ ప్రజాప్రతినిధిగా జోక్యం చేసుకుంటే తన భర్త మిక్కిలినేని నరేంద్రను చంపుతామని కొంతమంది హెచ్చరించి, వాహనాన్ని ధ్వంసం చేశారని ఆరోపించారు. అలజడి సృష్టించేవారిని డివిజన్ నుంచి బయటకు పంపి ప్రశాంతమైన వాతావరణం ఏర్పాటు జరిగే వరకు తాను పోరాటం చేస్తామన్నారు.

## డీసీసీ అధ్యక్ష పదవికి జైపాల్ దరఖాస్తు

వైరా, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపల్ మాజీ ఛైర్మన్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అత్యంత సన్నిహితుడైన సూతకాని జైపాల్ ఖమ్మంజిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేశారు.

# కాంగ్రెస్‌లో సంతకాల జోరు

- ఒకేరోజులో నియోజకవర్గంలో ఓట్ చోరీపై కార్యక్రమం
- పాల్గొన్న మేయర్, కార్పొరేటర్లు
- ఫోన్లు చేసి అభినందించిన మంత్రి తుమ్మల



సంతకాల సేకరణలో కార్పొరేటర్ పాలేపు విజయవెంకటరమణ



ముస్తాఫానగర్ సెంటర్‌లో పాల్గొన్న యుగంధర్, మేయర్ నీరజ

ఖమ్మం కార్పొరేషన్, అక్టోబరు 12(ఆంధ్రజ్యోతి): కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ పార్టీ ఓట్లు చోరీకి పాల్పడి పలు రాష్ట్రాల్లో అధికారంలోకి వచ్చిందని మేయర్ పునుకొల్లు నీరజ పేర్కొన్నారు. ఖమ్మం నియోజకవర్గంలో ప్రారంభించిన ఓటచోర్ సంతకాల సేకరణ ఖమ్మం గల్లి నుంచి ఢిల్లీ వరకు చేరుతుందన్నారు. ముస్తాఫానగర్ సెంటర్‌లో నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు తుమ్మల యుగందర్‌తో కలిసి పాల్గొన్నారు. ఖమ్మం గుమ్మం అంటే కాంగ్రెస్‌కు కంచుకోటగా ఉందన్నారు. రాపర్తి నగర్‌లో నిర్వహించిన సంతకాల సేకరణలో కార్పొరేటర్ రాపర్తి శరత్‌కుమార్ ఇంటింటికి వెళ్లి సంతకాల సేకరణ జరిపారు.నగరంలోని 60 డివిజన్లలో కాంగ్రెస్ కార్యకర్తలు ఉత్సాహంగా పాల్గొంటున్నారని ఆమె పేర్కొన్నారు.

### 44వ డివిజన్‌లో..

44వ డివిజన్‌లో కార్పొరేటర్ పాలేపు విజయవెంకటరమణ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ చేశారు. ఏఐసీసీ, టీపీసీసీ పిలుపుమేరకు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సూచనలతో ఆదివారం సంతకాల సేకరణ జరిపారు. నియోజకవర్గంలో ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలను వివరించారు. సాయంత్రం తుమ్మల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయానికి పాలేపు వెంకటరమణ ముఖ్య నాయకులతో వెళ్లి తుమ్మల యుగంధర్‌కు సేకరించిన సంతకాలను అందించారు.

### 46వ డివిజన్‌లో..

46వ డివిజన్‌లో కార్పొరేటర్ కన్నం వైష్ణవి ప్రసన్న ఆధ్వర్యంలో కార్యకర్తల సంతకాల సేకరణ చేశారు. రికార్డు స్థాయిలో ఒకే డివిజన్‌లో 950 సంతకాలను సేకరించారు. నాయకులు కన్నం ప్రసన్నకృష్ణ, షేక్ రజీ, బాల్దే నాగేశ్వరరావు, ఎంఏరామకృష్ణకాటా యాదయ్య, తుగర్ భాస్కర్, కన్నం రమేశ్, సెల్వం జ్ఞానేశ్వర్, కాటం కొమరయ్య పాల్గొన్నారు.

### 15వ డివిజన్‌లో..

15వడివిజన్‌లో స్థానిక కార్పొరేటర్ రావూరి కరుణ, వీవీపాలెం సొసైటీ ఛైర్మన్ రావూరి కరుణ ఆధ్వర్యంలో 1500 సంతకాల సేకరణ చేశారు. 10వ డివిజన్‌లో చావా నారాయణ ఆధ్వర్యంలో, 11వ డివిజన్‌లో సరిహుడి రమాదేవి సతీష్ ఆధ్వర్యంలో భారీ ప్రచారం చేశారు. వందలసంఖ్యలో సంతకాల సేకరణ జరిపారు. విజయవంతం చేశారు.

### మంత్రి తుమ్మల అభినందన

ఖమ్మం నియోజకవర్గంలో ఊహించినదానికంటే రికార్డుస్థాయిలో 60డివిజన్లతో పాటుగా రఘునాథపాలెం మండలంలోను సంతకాల సేకరణ జరిగింది. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు స్వయంగా ఫోన్లు చేసి అభినందించారు. ఏఏ డివిజన్లలో ఎన్ని సంతకాలు జరిగాయో నాయకులకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. మంత్రి స్వయంగా అభినందించటంతో నాయకులు మరింత ఉత్సాహంతో పనిచేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, నగర కాంగ్రెస్ అధ్యక్షులు ఎండీ జావీద్ పాల్గొన్నారు.









రాపర్తినగర్‌లో కార్పొరేటర్ శరత్‌కుమార్, 15వ డివిజన్‌లో యుగంధర్, చావా, రావూరి, సరిహుడి, 46వ డివిజన్ పత్రాలను అందిస్తున్న కన్నం ప్రసన్నకృష్ణ, ముస్తాఫా నగర్‌లో ఎలుగొండస్వామి..

## ఫోర్‌వీల్ మెకానిక్‌లకు ఉచిత శిక్షణ

ఖమ్మంఖానాపురంహవేలి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈనెల16 నుంచి 18 వరకు ఫోర్‌వీలర్ మెకానిక్‌లకు ఖమ్మం రోటరీనగర్‌లో శిక్షణ అందిస్తున్నట్లు లెర్నెట్ స్కిల్ ప్రాజెక్ట్ మేనేజర్ మత్తి రామకృష్ణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ శిక్షణను క్యాస్ట్రోల్ వారిసహకారంతో అందిస్తున్నట్లు తెలిపారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5గంటల వరకు శిక్షణ ఉంటుందని, అనంతరం సర్టిఫికెట్లు అందిస్తామని, ఆసక్తి గలవారు 9912465999 నెంబరును సంప్రదించాలని తెలిపారు.

## రౌడీ చర్యలను పోలీసులు పట్టించుకోవటం లేదు

**సీపీఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కమిటీ**

ఖమ్మంసంక్షేమవిభాగం, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి): విద్యావైద్యంతో పాటుగా అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతున్న ఖమ్మం నగరంలో ఇటీవల రౌడీ మూకల అలజడులు పెరుగుతున్నాయని,రౌడీ చర్యలను పోలీసులు పట్టించుకోకపోవటంతో ప్రశాంతంగా ఉన్న ఖమ్మం నగరంలో అశాంతిగా మారుతోందని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా కమిటీ తీవ్రంగా ఖండించింది. ఈమేరకు ఆదివారం ఖమ్మం డివిజన్ కార్యకర్తల సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఆవుల అశోక్, జీ రామయ్య, సీవై పుల్లయ్య మాట్లాడారు. ఓకుటుంబంలోని అన్నదమ్ముల మధ్య పంచాయతీని గంజాయిబ్యాచ్, తాగుబోతులు, రౌడీషీటర్లు ప్రజల నివాసాల మధ్య సంచరిస్తూ ప్రశాంతంగా ఉన్న నగరాన్ని అరాచకశక్తులకు మూలాలుగా మారుస్తున్నారని ఆరోపించారు.

# దొంగ ఓట్ల విధానానికి సహకరించిన ఎన్నికల కమిషన్

» డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్

సత్తుపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వేరే రాష్ట్రాల్లోని ఓట్లను అవసరమైన చోటా డబుల్ ఓట్లు పెట్టించుకుని బీజేపీ అధికారంలోకి వచ్చిందని, ఈ దొంగ ఓట్ల విధానానికి ఎన్నికల కమిషన్ సహకరించిందని డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ ఆరోపించారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయిలో ఓట్‌చోరీ కార్యక్రమాన్ని కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్‌తో కలిసి ప్రారంభించారు. అందరూ పోరాటం చేసేది వ్యక్తిమీద కాదని వ్యవస్థ మీదేనని, ఓటు హక్కును తీసేసి వారికి అవసరమైన వ్యక్తుల పేరుతో ఓట్లు సృష్టించుకోవడం రాజ్యాంగ విరుద్ధమన్నారు. రాజ్యాంగాన్ని కాపాడడం కోసం, ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలనే ఉద్దేశ్యంతో రాహుల్‌గాంధీ దేశవ్యాప్తంగా చేపట్టిన ఓట్‌చోర్-గద్దిచోడ్‌ను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ క్రమంలో ఈనెల 14వ తేదీలోపు నియోజకవర్గంలోని ప్రతిఒక్కరూ ఉద్యమంలా సంతకాలను సేకరించాలని ప్రతి కార్యకర్తకు సూచించారు. కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


సత్తుపల్లిలో మాట్లాడుతున్న పువ్వాళ్ల దుర్గాప్రసాద్

## కేంద్ర మంత్రిని కలిసిన నంబూరి



సత్తుపల్లి, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): కేంద్ర హోంశాఖ సహాయమంత్రి జి.కిషన్‌రెడ్డిని ఆదివారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో బీజేపీ ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ నంబూరి రామలింగేశ్వరరావు మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సత్తుపల్లిలోని సింగరేణి ప్రభావిత ప్రాంతాలలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను వినతి పత్రం ద్వారా మంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు నంబూరి తెలిపారు. బాంబ్ బ్లాస్టింగుల కారణంగా పలు ప్రాంతాల్లోని ఇళ్లు దెబ్బతింటున్నాయని, సైలో బంకర్ కాలుష్యం కారణంగా కిష్టారం గ్రామంలో అనారోగ్యం పాలవుతున్న ప్రజల ఆరోగ్యంపై తూతూమంత్రంగా చేతులుదులుపుకుంటున్న సింగరేణి యాజమాన్యం హెల్త్‌క్యాంపులతో పాటు కాలుష్య నివారణకు మొక్కలు నాటి వారి సంరక్షణ బాధ్యత తీసుకోవాలని డిమాండ్ చేశారు. తాగునీటి సౌకర్యంతో పాటు స్థానికులకే ఉద్యోగాలు ఇవ్వాలని, భూములు కోల్పోయిన వారికి పెండింగ్‌లోని నష్టపరిహారం వెంటనే ఇప్పించేలా చర్యలు తీసుకునేలా ఆదేశించాలని మంత్రిని కోరానని, సానుకూలంగా స్పందించిన మంత్రి పరిశీలించి అధికారులను ఆదేశిస్తానని హామీ ఇచ్చినట్లు నంబూరి పేర్కొన్నారు.

## వివేకానంద ఎక్సలెన్సీకి 100కుర్చీల వితరణ

సత్తుపల్లిరూరల్, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని జేవీఆర్ పార్క్ ఎదురుగా ఉన్న వివేకానంద ఇనిస్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ ఎక్సలెన్సీకి లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తుపల్లి బాధ్యులు రూ.25వేల విలువైన 100కుర్చీలను ఆదివారం వితరణగా అందజేశారు. ఈ సందర్భంగా ఎక్సలెన్సీ నిర్వాహకులు సంఘ బాధ్యులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ ప్రాంతంలోని విద్యాభివృద్ధికి, యువత ఉద్యోగ అవకాశాలు సాధించేందుకు ఈ ఎక్సలెన్సీ అభివృద్ధికి దాతలు సైతం ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ గవర్నర్ మదన్‌మోహన్ రేపాల, బాధ్యులు బాచుపల్లి రవీందర్, సతీష్ కోడే, గోగడ రవి, ఎంవీ.రమణ, దారా కృష్ణారావు, సోమిరెడ్డి, ప్రభాకరరెడ్డి, వెల్ది జగన్మోహనరావు, పెనుగొండ రమేష్, పీడీ శ్రీనివాసరెడ్డి, చీకటి శ్రీనివాసరావు, గట్టే వాసు, చల్లగుళ్ల అప్పారావు, శ్రీనివాసరావు, మధు పాల్గొన్నారు.


కుర్చీలను అందిస్తున్న క్లబ్ బాధ్యులు

## జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి వేమిరెడ్డి దరఖాస్తు

మధిర, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): ఖమ్మం జిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి వేమిరెడ్డి శ్రీనివాస రెడ్డి దరఖాస్తు చేశారు. మధిర నుంచి తన అనుచరులతో కలిసి కార్ల ర్యాలీతో వెళ్లిన ఆయన శనివారం రాత్రి జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో ప్రస్తుత జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్‌కు తన దరఖాస్తును అందజేశారు. గత రెండు దశాబ్దాలుగా డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కకు అత్యంత నమ్మకమైన అనుచరుడిగా ఉన్న ఆయన డీసీసీ పీఠం కోసం దరఖాస్తు చేసుకోవడంతో సర్వత్రా ఆసక్తి ఏర్పడింది. మాజీ శాసన సభ్యులు కొండబాల కోటేశ్వరరావు, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు, సెంట్రల్ బ్యాంక్ చైర్మన్ దొండపాటి వెంకటేశ్వరరావు, మధిర మార్కెట్ కమిటి చైర్మన్, మాజీ చైర్మన్లు నరసింహరావు, చావ రామకృష్ణ, మధిర, ఎర్రుపాలెం, వైరా మండల కాంగ్రెస్ అధ్యక్షులు సూరంశెట్టి కిషోర్, సుధాకర్ రెడ్డి, శీలం వెంకటనరిసింహ రెడ్డి, నాయకులు చావా వేణు, సుధాకర్ పాల్గొన్నారు.


దరఖాస్తు అందజేస్తున్న వేమిరెడ్డి

## గంగారావును సన్మానించిన మిత్రబృందం


గంగారావును సన్మానిస్తున్న మిత్ర బృందం

వైరా, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వైరా వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన బొళ్ల గంగారావును ఆయన మిత్రబృందం ఆదివారం సన్మానించింది. 1987-88పదోతరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులైన మిత్రులు గంగారావును అభినందించి సన్మానించారు. భవిష్యత్‌లో మరికొన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు. వైరా మాజీ మునిసిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, గ్రంధి లక్ష్మీనర్సయ్య, మిట్టపల్లి సైదేశ్వరరావు, ధనాల కోట దుర్గాప్రసాద్, మిట్టపల్లి రాము, ఊటుకూరి రామారావు, నంబూరి నర్సింహారావు, దేవభక్తిని కిషోర్, షేక్.జానీ, గండు యాదగిరి, కస్తాల శ్రీనివాసరావు, కొల్లి హన్మంతరావు, సిరిపురం రవి పాల్గొన్నారు.

## వైరా సీఐ సాగర్ బదిలీ


బదిలీ అయిన సీఐ సాగర్

వైరా, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): గత మూడు సంవత్సరాల నుంచి వైరా సీఐగా పనిచేస్తున్న నునావత్ సాగర్ బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వైరా సీఐగా వి.వినయ్‌కుమార్ రానున్నారు. వైరా సీఐ సాగర్‌ను మల్టీజోన్ ఐజీ కార్యాలయంలో రిపోర్టు చేయాలని బదిలీ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. డిప్యూటేషన్‌పై సీఎస్‌బీలో ఉన్న వినయ్‌కుమార్‌ను వైరాకు బదిలీ చేశారు.

## రిటైర్డు ఏఎస్సైకి ఘన సన్మానం

కల్లూరు, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): కల్లూరు పోలీసుస్టేషన్‌లో తాజాగా ఉద్యోగ విరమణ పొందిన ఏఎస్సై జర్పుల వెంకటేశ్వర్లు దంపతులను ఆదివారం పోలీసుశాఖ వారు ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సత్తుపల్లి రూరల్ సీఐ ముత్తులింగయ్య, కల్లూరు ఎస్ఐ హరిత, సిబ్బందిలు జర్పుల వెంకటేశ్వర్లు, జ్యోతి దంపతులను ఘనంగా శాలులతో సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు ప్రసంగిస్తూ విధి నిర్వహణలో వెంటేశ్వర్లు చేసిన సేవలను ప్రశంసించారు. జర్పుల బాల్యమిత్రుల కుటుంబ సభ్యులు, సహచర పోలీసు సిబ్బందిలు పాల్గొన్నారు.


రిటైర్డు ఏఎస్సైని సన్మానిస్తున్న దృశ్యం



## ఖురాన్ పఠించడంతో మానసిక ప్రశాంతత


విద్యార్థులకు బ్యాగులు అందజేస్తున్న దృశ్యం

మధిర,అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): ఖురాన్ ప్రజలందరూ పరస్పరం సేవ, ప్రేమతత్వంతో కలిసి మెలిసి జీవించాలని చెబుతుందని ఖురాన్ పఠించడంతో మానసిక ప్రశాంతత కలుగుతుందని ముస్లిం ఐక్య సంఘం తెలంగాణ సెంట్రల్ కమిటీ అధ్యక్ష, ఉపాధ్యక్షులు షేక్ ముజాహిద్, షేక్ హుస్సేన్ సాహెబ్ అన్నారు. ఆదివారం మధిరలోని జామియా మసీదులో జరిగిన మధిర నియోజకవర్గం ముస్లీం ఐక్య సంఘం కమిటీ సభ్యుల సమావేశంలో వారు పాల్గొని ఇస్లాం ఆచారాలు, నియమాలను ప్రతి ముస్లిం పాటించాలని అన్నారు. ఈ సందర్భంగా ముక్తాబ్ చదువుతున్న మధిర, ఎర్రుపాలెం, బోనకల్ మండలాలకు చెందిన 230 మంది విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు అందజేశారు. ముస్లిం నాయకులు మత పెద్దలు పాల్గొన్నారు.

## లారీ అండ్ డీసీఎం అసోసియేషన్ కార్యవర్గం ఎంపిక

» బానోతు రాంబాబు, మాడిశెట్టి సురేష్



కల్లూరు, అక్టోబరు12 (ఆంధ్రజ్యోతి) కల్లూరు మండల లారీ అండ్ డీసీఎం అసోసియేషన్ నూతన కార్యవర్గం ఎంపిక ఏకగ్రీవంగా జరిగింది. ఆదివారం స్థానిక లారీ అండ్ డీసీఎం అసోసియేషన్ కార్యాలయంలో లారీ అండ్ డీసీఎం ఓనర్ల సమక్షంలో ఈ ఎన్నిక నిర్వహించారు. అధ్యక్షుడిగా బానోతు రాంబాబు, వర్కింగ్ ప్రసిడెంట్‌గా మాడిశెట్టి సురేష్, ప్రధాన కార్యదర్శిగా గుమ్మడి నరేష్, ఉపాధ్యక్షుడిగా పసుపులేటి అచ్యుత్, సహాయ కార్యదర్శిగా బోడా మహేష్, కోశాధికారిగా కె వి సత్యనారాయణ, ఆర్గనైజర్‌గా ఎస్‌కె పాషా, మాడిశెట్టి నాగరాజు, పాశం నరిసింహారావు, గుండ్ల కోటేశ్వరరావులు ఎంపికైనారు. లారీ, అండ్‌డీసీఎం ఓనర్ల సంఘం సీనియర్ నాయకులు పసుపులేటి కోటేశ్వరరావు, నీలం వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

## కుమరం భీం వర్ధంతి వేడుకలు


కుమరం భీం విగ్రహానికి నివాళులర్పిస్తున్న నాయకులు

ఏన్కూరు, అక్టోబరు12(ఆంధ్రజ్యోతి): ఆదివాసీల్లో వెలుగులు నింపిన గొప్ప పోరాటయోధుడు కుమరం భీం 85వ వర్ధంతి వేడుకలను కుమరం భీం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఏన్కూరులో ఘనంగా నిర్వహించారు. ముందుగా కుమరం భీం, అంబేడ్కర్ విగ్రహాలకు పూలమాలలువేసి నివాళులర్పించారు. ఏఎంసీవైస్ చైర్మన్ మల్కం గంగులు, కొమరం భీం ఫౌండేషన్ కమిటీ సభ్యులు పూసం సుధీర్, వాసం నరేష్, బొల్లి గోపాల్‌రావు, సిద్దబోయిన వెంకట్, ముక్తిఫణి, వాసం సాంబ, ముక్తి వరప్రసాద్, యలగల చరణ్, వాసం శ్రీకాంత్, బీజేపీ నాయకులు కొవ్వూరి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## డీసీసీ అధ్యక్ష పదవికి జైపాల్ దరఖాస్తు

వైరా, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వైరా మునిసిపల్ మాజీ చైర్మన్, మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అత్యంత సన్నిహితుడైన సూతకాని జైపాల్ ఖమ్మంజిల్లా కాంగ్రెస్ అధ్యక్ష పదవికి దరఖాస్తు చేశారు. ఆదివారం డీసీసీ ఎన్నికల పరిశీలకుడు మహేందర్‌కు జైపాల్ ఈ దరఖాస్తును అందజేశారు. టెలికం అడ్వైజరీ మెంబర్ మచ్చా రామారావు, వైరా ఏఎంసీ డైరెక్టర్ రేచర్ల సత్యం, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు గరిడేపల్లి కిషోర్, ధార్న వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## బదిలీపై వెళ్తున్న పోలీసులకు సన్మానం

వైరా, అక్టోబరు 12 (ఆంధ్రజ్యోతి): వైరా పోలీస్‌స్టేషన్ నుంచి బదిలీపై వెళ్తున్న పోలీసులను ఎస్ఐ పుష్పాల రామారావు ఆధ్వర్యంలో సిబ్బంది ఆదివారం సన్మానించారు. గత ఆరు సంవత్సరాల నుంచి హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహించి ఏఎస్సైగా ఉద్యోగోన్నతి పొంది మహబూబాబాద్‌కు వెళ్తున్న కృష్ణమూర్తిని అలాగే గత ఆరేడేళ్ల నుంచి పోలీస్‌స్టేషన్‌లో రైటర్‌గా విధులు నిర్వహించి బదిలీపై తల్లాడ వెళ్తున్న కానిస్టేబుల్ మాతంగి విజయ్‌ను శాల్స్ పూలమాలలతో సన్మానించారు.